
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

సోమవారం 9 డిసెంబరు 2024





పొన్నూరు: నిడుబ్రోలు జగనన్న కాలనీలో ప్రధాన రహదారి దుస్థితి



పేరేచర్ల: పునాదుల, గోడల దశలో ఆగిపోయిన పేదల ఇళ్లు

- అక్రమాలపై దృష్టి సారించిన ప్రభుత్వం
- పరిశీలనకు సెర్ప్ ప్రత్యేక మొబైల్ యాప్
- పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాకు ఒక సచివాలయం ఎంపిక
- మండలానికి వెలుపల అధికారుల బృందంతో క్షేత్రస్థాయిలో తనిఖీ
- గ్రామాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణ
- సోమ, మంగళవారాల్లో తనిఖీ.. 10న ప్రభుత్వానికి నివేదిక





పింఛన్ల.. పరిశీలన

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పింఛను అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల విషయంలో కూటమి ప్రభుత్వం వచ్చాక వెలుగు చూసిన అక్రమాలను పరిశీలించి, ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాకో సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని, ఆ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి పింఛనుదారులను స్వయంగా అధికారులు పరిశీలించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 9, 10 తేదీల్లో ఈ తనిఖీలు పూర్తి చేసి అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.

సెర్ప్ ఆధ్వర్యంలో పరిశీలన

గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో పింఛన్ల పరిశీలన చేపట్టనున్నారు. అందుకోసం సెర్ప్ ఒక మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించింది. తనిఖీ చేసే అధికారుల బృందాన్ని సెర్ప్ నిర్ణయిస్తుంది. ఏ మండల పరిధిలో ఏ సచివాలయంలో తనిఖీలు జరుగుతాయో ఆ సచివాలయ పరిధిలోని ఉద్యోగులను ఈ బృందంలో సభ్యులుగా నియమించరు. ఆ మండలానికి వెలుపల ఉండే ఉద్యోగులతోనే బృందాన్ని ఏర్పాటు చేస్తారు. ఒక్కో బృందం 40 మంది పింఛనుదారుల వివరాలను పరిశీలించాలి. బృందాలు పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి వారి వివరాలను సెర్ప్ రూపొందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ అధికారులుగా ఉంటారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కూడా నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుంది. నివేదికను ఈ నెల 10న ప్రభుత్వానికి అందజేస్తారు. ఈ పరిశీలనలో అనర్హులుగా గుర్తించిన వారికి జనవరి నుంచి పింఛను రాదు. తొలగించిన ప్రతి ఒక్క పింఛనుదారుడికి వారి పింఛను తొలగింపునకు సంబంధించిన కారణాన్ని తెలుపుతూ వారికి ఒక అక్నాలెడ్జ్‌మెంటు లెటర్ వస్తుంది. ఆ లెటర్ అందుకున్న వారిలో అర్హులు ఉంటే వారు సంబంధిత సచివాలయంలో అర్హతా పత్రాలు సమర్పిస్తే, అధికారులు వాటిని పరిశీలించి పింఛన్‌ను పునరుద్ధరించే అవకాశం ఉంది.

● వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా..

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా పింఛన్లు మంజూరు చేశారు. నిజమైన అర్హులను అనర్హులుగా పేర్కొని, వారిని తొలగించి, అనర్హులను పింఛనుదారులుగా నమోదు చేసి వారికి పింఛన్లు అందజేశారు. ప్రధానంగా దివ్యాంగ పింఛన్ల విషయంలో ఈ అక్రమాలు అంతులేకుండా ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఇష్టమొచ్చినట్లుగా సదరం సర్టిఫికెట్లు జారీ చేయడంతో అర్హులకు అందాల్సిన పింఛన్లను వైసీపీ అనుయాయులు కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అక్రమాలన్నీ వెలుగులోకి వచ్చాయి. పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో స్వయంగా స్థానిక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు లబ్ధిదారులను చూసి ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. అనేకమంది అనర్హులు పింఛన్లు తీసుకోవడం గమనించిన ప్రజాప్రతి నిధులు ప్రభుత్వానికి ఈ విషయాన్ని నివేదించారు. ఈ క్రమంలో తాజాగా పింఛన్ల పరిశీలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాకు ఒక గ్రామ/వార్డు సచివాలయంలో తనిఖీలు నిర్వహించనున్నారు. గుంటూరు జిల్లాలో చేబ్రోలు మండలం వేజెండ్లలోని సచివాలయ పరిధిలోని పింఛనుదారుల వివరాలను పరిశీలించనున్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడు?

పాత పింఛన్ల తనిఖీల మాటెలా ఉన్నా జిల్లాలో కొత్త పింఛన్ల మంజూరు కోసం ఎదురు చూసే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతూ ఉంది. దానికి తోడు కొత్త పింఛన్లు, రేషన్‌కార్డుల ప్రక్రియకు సంబంధించి అనేక వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఈ నెల 15 నుంచి కొత్త పింఛన్ల దరఖాస్తు ప్రక్రియ మొదలవుతుందన్న ఊహాగానాలు వస్తున్నాయి. ఈ నెల 15న ప్రక్రియను ప్రారంభించి వచ్చే నెల సంక్రాంతి నుంచి పింఛన్లు అందజేస్తారన్న వార్తలు వినిపిస్తుండడంతో లబ్ధిదారుల్లో హడావుడి పెరిగింది.

కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నామని గత వైసీపీ పాలకులు ప్రకటనలతో సరిపెట్టారు. పదుల ఎకరాల్లో వందల్లో లేఅవుట్లు వేసి వేలల్లో ఇళ్లు మంజూరు చేయగా అరకొరగానే ఇళ్లు పూర్తి అయ్యాయి. మొండిగోడలు, పిచ్చిమొక్కలతో జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. పేరుగొప్ప ఊరుదిబ్బ అనుచందంగా జగనన్నకాలనీలు ఉన్నాయి. చాలావరకు ఇళ్లు పునాదుల దశకే పరిమితమయ్యాయి. కాలనీలకు రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ, తాగునీరు తదితర కనీస సౌకర్యాలు కల్పన చేయకుండా.. వాటికి సంబంధించి ఆలోచన చేయకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలంటూ లబ్ధిదారులను పరుగులు పెట్టించింది. దీంతో కొందరు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకోగా కనీస మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు లేకపోవడంతో నివాసానికి లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. నాటి పాలకులు కాలనీలు కాదు ఊళ్లు అని ప్రకటించగా.. ఐదేళ్లకు అవి చిట్టడవులు, బురదగుంతలను తలపించేలా మారాయి. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టిన వెంటనే కాలనీల్లోని పేదల ఇళ్లపై దృష్టి సారించింది. ఇళ్ల నిర్మాణాలకు లక్ష్యాలు నిర్దేశించింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి.

కాలనీలు.. పునాదుల్లోనే

- పేరుగొప్ప ఊరుదిబ్బగా జగనన్న కాలనీలు
- మౌలిక వసతుల కల్పనలో గత పాలకుల అలసత్వం
- ఈ నెలాఖరుకు ఇళ్లు పూర్తికి కూటమి ప్రభుత్వం లక్ష్యం
- సొంతంగా నిర్మించుకున్నా నివాసయోగ్యంగా లేని వైనం
- అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా కాలనీ ప్రాంగణాలు
- కాలనీల పేరుతో హడావుడీకే పరిమితమైన గత ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి ఫోకస్

(గుంటూరు, న్యూస్‌నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

పేరు గొప్ప ఊరుదిబ్బగా జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పేరుతో కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. అయితే నాలుగేళ్ల పాటు హడావుడీకే పరిమితం కాగా ప్రస్తుతం పలు కాలనీల్లో ఇళ్లు పునాదులకే పరిమితమయ్యాయి. కొన్ని దగ్గర్ల ఇళ్లు మొండిగోడలతో కనిపిస్తున్నాయి. ఊర్లకు దూరంగా కాలనీలు ఏర్పాటు చేసింది. పైగా ప్రభుత్వం తొలుత ప్రకటించినట్లు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా ఆ భారం లబ్ధిదారులపైనే వేయడంతో ఊర్లకు దూరంగా ఉన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉండేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. పేదలందరికీ స్థలాలు ఇచ్చి, వారికి ఇళ్లు నిర్మించి ఇస్తానని ముఖ్యమంత్రి చెప్పిన మాట ఆచరణలో నీటి మూటగానే మిగిలిపోయింది. ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసి మెలిక పెట్టడంతో లబ్ధిదారులు నిర్మాణాలపై వెనుకంజ వేశారు. ఇల్లు కట్టుకోకుంటే స్థలం పోతుందని.. లేదంటే మరొకరికి ఇచ్చేస్తామని లబ్ధిదారులను బెదిరించి మరీ ఇళ్లను నిర్మించుకునేలా అధికారులు చేసినా పెద్దగా నిర్మాణాలు సాగలేదు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు.. ఇల్లు కట్టుకున్న తర్వాత నివాసం ఉండేందుకు అవసరమైన

(మిగతా 6వ పేజీలో..)

ప్రభుత్వ సహకారం..

జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం ప్రారంభించి ఆర్థిక ఇక్కట్లతో అర్థంతరంగా ఆపేసిన వారికి సహకారం అందించి ఇళ్లు పూర్తి చేసేలా చూడాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశాలను సైతం కూటమి ప్రభుత్వం ఇచ్చింది. గత ప్రభుత్వంలో లేఅవుట్లలో ప్లాట్ పొంది ఇంటి నిర్మాణం ప్రారంభించని వారి విషయంలో ప్రభుత్వం అంతర్గతంగా విచారణ జరుపుతుంది. ఇక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులకు సంబంధించి అధికారులు అంచనాలు రూపొందించారు. ఈ నిధులపై ఇప్పటికే కూటమి ప్రభుత్వం కదలిక తెచ్చింది. త్వరలోనే వీటిని మంజూరు చేసి ఆయా కాలనీలను నివాసయోగ్యంగా మార్చేందుకు సిద్ధమైంది.

73,932 ఇళ్లకు 22,353 పూర్తి

ఐదేళ్లలో పేదలందరికీ ఇళ్లు కట్టి ఇస్తామని అట్టహాసంగా ప్రకటన చేసిన గత వైసీపీ ప్రభుత్వం ఆచరణలో బోర్లా పడింది. చెప్పిన ఇళ్లలో మూడో మూడో వంతు ఇళ్లను కూడా నిర్మించలేక చేతులెత్తేసింది. గుంటూరు జిల్లాలో 247 లే అవుట్లలో 73,932 ఇళ్లు నిర్మించేందుకు గత ప్రభుత్వం పూనుకుంది. వాటిలో 63,823 ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా, ఇప్పటికీ శంకుస్థాపన కూడా కాని ఇళ్లు 10,109 ఉన్నాయి. ప్రారంభించిన ఇళ్లలో 22,353 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిలో వైసీపీ ప్రభుత్వం పూర్తి చేసింది 18,523 ఇళ్లు కాగా కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో 3,830 ఇళ్లు పూర్తయ్యాయి. గుంటూరు డివిజన్ పరిధిలో ఇప్పటికీ 3,561 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. 4,965 ఇళ్లు పునాదుల దశలోనే ఆగిపోగా, 13,817 ఇళ్లు మొండిగోడలకే పరిమితమయ్యాయి. 3,181 ఇళ్లు శ్లాబు దశకు చేరుకోగా, 2,362 ఇళ్లకు శ్లాబులు పూర్తయ్యాయి. తెనాలి డివిజన్ పరిధిలో 32,464 ఇళ్లు నిర్మించ తలపెట్టగా కేవలం 8,762 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. 6,548 ఇళ్లు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. మొత్తంగా జిల్లాలో 30 శాతం ఇళ్లు పూర్తవగా, 70 శాతం ఇళ్లు అంటే 51,579 ఇళ్లు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. ఎన్నికలకు ముందు హడావుడిగా కొన్ని ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశం చేయించినట్లుగా వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. అయితే ఆయా కాలనీల్లో ఈనాటికీ మౌలిక సదుపాయాలు లేవు. రాష్ట్రంలోనే అతిపెద్ద లే- అవుట్‌గా చెబుతున్న పేరేచర్ల లే- అవుట్‌కు వెళ్లే దారి అత్యంత ప్రమాదకరంగా ఉంది. వట్టిచెరుకూరు రోడ్డులో జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు వర్షం వస్తే గంతలమయింగా మారి ప్రమాదకరంగా ఉంది. తెనాలి అర్బన్, రూరల్ గ్రామాలకు 21 లేఅవుట్లలో 13244 మందికి నివేసన స్థలాలను ఇవ్వగా ఆరో సంవత్సరంలోకి అడుగు పెడుతున్నా కేవలం 1448 ఇల్లు మాత్రమే నిర్మించుకున్నారు. అందులో చాలా వరకూ నివాసం ఉండటంలేదు. పొన్నూరు పట్టణం నిడుబ్రోలులో 99.89 ఎకరాల విస్తీర్ణంలో కాలనీ ఏర్పాటు చేసి 4544 ప్లాట్లు వేసి 4185 మందికి పట్టాలను పంపిణీ చేయగా కేవలం 200 మంది మాత్రమే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నారు.

మంత్రి పర్యటనలో ఫిర్యాదుల వెల్లువ

ఈ ఏడాది సెప్టెంబరులో గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పేరేచర్ల లే అవుటను పరిశీలించారు. లే అవుట్‌లో నీరు, విద్యుత్, రోడ్లు లేక నరకం చూస్తున్నామని, ఇంటి సామాగ్రి చోరీ అవుతోందని కాలనీవాసులు ఆయనకు తమ గోడు వెళ్లబోసుకున్నారు.



గుంటూరు: ఇళ్ల నిర్మాణం పూర్తయినా కనిపించని అంతర్గత రోడ్డు



తెనాలి: అంగలకుదురులో రోడ్లు లేక దుస్థితిలో ఉన్న కాలనీ



గుంటూరు: ఓబులనాయుడు పాలెం లే అవుట్లో నిలిచిన నీరు

నేటితో గడువు ముగింపు

- పట్టభద్రుల ఓటుకు వేలల్లో దరఖాస్తులు
- ఇప్పటికే 2,90,978 మందికి ఓటు హక్కు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా క్లెయిమ్‌లు/అభ్యంతరాల దాఖలుకు సోమవారం సాయంత్రంతో గడువు ముగియనుంది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం కూడా వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. గత నెల 23న డ్రాఫ్టు ఓటరు లిస్టుని ప్రచురించిన తర్వాత ఈ నెల 9 వరకు క్లెయిమ్‌లు/అభ్యంతరాల దాఖలుకు ఎన్నికల సంఘం గడువు ఇవ్వడంతో ఇంకా ఓటరుగా నమోదు కాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం మరో 60 వేలకు పైగా కొత్త దరఖాస్తులు ఆరు జిల్లాల నుంచి రావడం విశేషం. ఇంకా మరికొన్ని గంటల గడువు సమయం మాత్రమే ఉండటంతో ఈ సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉన్నది. ఎవరైతే 2021 నవంబరు 1వ తేదీ నాటికి డిగ్రీ పట్టాని పొంది ఉంటారో వారందరికి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే 2 లక్షల 90 వేల 978 మంది పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీలు సమీపిస్తున్న దృష్ట్యా క్లెయిమ్‌ల సందర్భంగా వస్తోన్న దరఖాస్తులను మరుసటి రోజే పరిశీలన జరిపించి పరిష్కరిస్తున్నారు.

అతివేగంతో.. అనంతలోకాలకు

- బ్రాహ్మణపల్లి సమీపంలో అదుపుతప్పిన కారు
- నలుగురు మృతి.. మరో నలుగురికి తీవ్రగాయాలు
- కొండగట్టులో మొక్కు చెల్లించి వస్తుండగా ఘటన
- మృతులది కావలి సమీపంలోని సిరిపురం గ్రామం

పిడుగురాళ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అతి వేగం.. నలుగురిని బలితీసుకోగా, మరో నలుగురిని తీవ్రంగా గాయపరిచింది. వంద కిలోమీటర్లకు పైగా వేగంతో వస్తున్న కారు అదుపుతప్పి.. హైవేపై ఉన్న హెచ్చరిక బోర్డును ఢీకొట్టి.. ఆ తర్వాత చెట్టును ఢీకొట్టింది. నేరుగా చెట్టును ఢీకొట్టి ఉంటే ప్రమాద తీవ్రత మరింత పెరిగేదని పోలీసులు గుర్తించారు. కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా చెట్టు నుంచి కారును ఎక్స్‌కవేటర్ సాయంతో పక్కకు తొలగించాల్సి వచ్చింది. ఈ ప్రమాదానికి సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు.. నెల్లూరు జిల్లా కావలి రూరల్ పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన ఉప్పాళ్ల ప్రణయ్‌కుమార్ ఇటీవల కారు కొనుగోలు చేశారు. అదే గ్రామానికి చెందిన తుళ్లూరి సురేష్(35), ఉప్పాళ్ల యోబులు(65), కావలికి చెందిన తాతా పెద్దతిరుపతి(60) ఆంజనేయస్వామి మాల ధరించారు. ఈ క్రమంలో కొత్త కారుకు పూజలు చేయించుకోవాలని ప్రణయ్‌కుమార్ తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి బయల్దేరారు. దీంతో ఆయన కారులో మాలదారులతో పాటు కుటుంబసభ్యులు, బంధువులైన సురేష్ భార్య తుళ్లూరి వనిత(32), ఉప్పాళ్ల ఆదిలక్ష్మి, ఉప్పాళ్ల శ్రీను, ఉప్పాళ్ల తాతా కౌసల్యలు కూడా వెళ్లారు. వీరంతా శుక్రవారం కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో ఇరుముడులు చెల్లించుకుని స్వామి దర్శనం చేసుకున్నారు. తిరిగి వస్తూ శనివారం రాత్రి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం సమీపంలోని ఓ పెట్రోలు బంకు వద్ద అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 4 గంటల వరకు విశ్రాంతి తీసుకుని తిరిగి బయలుదేరారు. 5.30 గంటల సమయంలో అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర హైవేపై పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి సమీపంలోని గీతిక పాఠశాల వద్ద ఉన్న మలుపులోని హెచ్చరిక బోర్డును తొలుత ఢీకొట్టి ఆ తర్వాత ఆ పక్కనే ఉన్న చెట్టును కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో కారులోని నలుగురు మృతి చెందగా మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దతిరుపతి మృతి చెందగా ఆయన భార్య కౌసల్య తీవ్రంగా గాయపడ్డారు. సురేష్, ఆయన భార్య వనిత, మేనమామ ఉప్పాళ్ల యోబులు మృతి చెందగా యోబులు భార్య ఆదిలక్ష్మి, ప్రణయ్‌కుమార్, ఉప్పాళ్ల శ్రీనులకు తీవ్రగాయాలయ్యాయి. సురేష్ ప్రతి ఏడాది ఆంజనేయస్వామి మాలధరించి తిరుమల సమీపంలోని జపాలికి వెళ్తుండేవాడు. ఈసారి కొండగట్టుకు వెళ్లాలని నిర్ణయించుకుని కారులో వెళ్లి వస్తూ మృతి చెందాడు. సురేష్ విద్యుత్ కాంట్రాక్ట్ పనులు చేయిస్తుండగా, ఆయన భార్య వనిత కుట్టుమిషన్‌తో జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్దతిరుపతి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

ఘటనాస్థలిని పరిశీలించిన ఎస్పీ

ప్రమాదం గురించి తెలుసుకున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు, గురజాల డీఎస్పీ జగదీష్, ఆర్డీవో మురళీకృష్ణ, సీఐ వెంకట్రావు, సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారిని పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదం గురించి బంధువులకు సమాచారం ఇవ్వగా వారు ఆస్పత్రి వద్దకు తరలివచ్చారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబసభ్యులు ఒంగోలు, నెల్లూరుకు క్షతగాత్రులను తీసుకెళ్లారు. జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవ్‌కుమార్, పిడుగురాళ్ల రవాణాశాఖ అధికారి రాంబాబులు చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. రెండు రోజులు వరుసగా ఒకరే కారు డ్రైవింగ్ చేయడం, విశ్రాంతి లేకపోవడంతో నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఎస్పీ తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పోలీసు, వైద్యాధికారులు, మృతుల బంధువులతో ఫోన్‌లో మాట్లాడారు.



మలుపువద్ద కారు ఢీకొట్టగా పడిపోయిన హెచ్చరిక బోర్డును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



సంఘటనలో మృతిచెందిన వారు (సర్కిల్‌లో) మొదటి ఫొటో ఉప్పాళ్ల యోబులు, రెండో ఫొటో తాతా పెద్ద తిరుపతి, మూడో ఫొటో తుళ్లూరి సురేష్, వనిత దంపతులు (ఫైల్)



6

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆశీస్సులు అందజేస్తున్న చర్చి ఫాదర్‌లు

14న ఆలపాటి ఆత్మీయ సమావేశం

గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు- కృష్ణా జిల్లాల పట్టభద్రుల అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మద్దతుదారులు జిల్లాలోని పట్టభద్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నేతలతోపాటు, వివిధ ప్రజా సంఘాలు ఈ నెల 14న గుంటూరులోని ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఉన్న శ్రీ కన్వెన్షన్ హాలులో ఉదయం పది నుంచి ఒంటి గంట వరకూ ఈ సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో కూటమి ప్రముఖులతో పాటు, ప్రజా సంఘాల ముఖ్య నేతలు హాజరుకానున్నారు.

కమ్మ హాస్టల్ రుణం తీర్చుకోలేనిది

● రూ.8,21,000 విరాళం అందజేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శతాబ్ద కాలం పైగా తనలాంటి పేద విద్యార్థులకు ఉచిత వసతి కల్పించడంతోపాటు భోజనం పెట్టి తన చదువుకు, ఉన్నతికి ఎంతగానో దోహదం చేసిన కమ్మ హాస్టల్ రుణాన్ని జన్మజన్మలకు తీర్చు కోలేనని వినుకొండ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు.



జీవీ ఆంజనేయులును సత్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

స్థానిక అరండల్ పేట, శాఖమూరి లక్ష్మీ దేవమ్మ, కమ్మ హాస్టల్ ప్రాంగణంలో కమ్మ పాలకమండలి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయనకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య లాంటి పెద్దల నేతృత్వంలో ఈ వసతి గృహం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తనలాంటి వేలాదిమంది విద్యార్థులు చదువుకొని దేశ విదేశాలలో ఉన్నత రంగాలలో రాణించడం గర్వంగా భావిస్తున్నామని తెలిపారు. వసతి గృహ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కమ్మ హాస్టల్‌కు ఆయన రూ.8,21,000 విరాళాన్ని కార్యదర్శి మందలపు బంగారు బాబుకు అందజేశారు. పూర్వ విద్యార్థి సంఘం రూ 2,21,000 విరాళాన్ని అందజేసింది.. కార్యక్రమంలో కొర్రపాటి రామారావు, బొల్లెపల్లి శ్రీనివాసరావు, పాలేటి శ్రీనివాసు, గడ్డిపాటి సుధాకర్, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేను ఆడుకున్న నేల ఇది

రావిపాడు అమలోద్భవి మాత ఉత్సవాల్లో కేంద్రమంత్రి పెమ్మసాని

రావిపాడు(నరసరావుపేట), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : రావిపాడు తాను ఆడుకున్న నేల అని, అక్షరం దిద్దింది.. పుస్తకం పట్టింది కూడా ఇక్కడేనని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తన బాల్యాన్ని గుర్తు తెచ్చుకున్నారు. నరసరావుపేట మండలం రావిపాడులోని అమలోద్భవిమాత ఉత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. 'అమ్మను ఎలాగైతే మర్చిపోలేమో.. తనకు చదువు నేర్పిన టీచర్లను కూడా ఎప్పటికీ మర్చిపోలేను. ఒక పిల్లవాడు ఎదిగే క్రమంలో కొన్ని కొన్ని సంఘటనలు ఎదురవుతాయి.. ఆ సంఘటనలు ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేస్తాయి' అని అన్నారు. అమెరికాలో ఎంత పెద్ద బిజినెస్ సామ్రాజ్యాన్ని తాను స్థాపించినా, వైద్యుడిగా సేవ చేస్తున్నా, రాజకీయ రంగంలో ప్రజాసేవ చేస్తున్నా.. ఉపాధ్యాయులు తనకు నేర్పిన క్రమశిక్షణ, విలువల వల్లే ఇవన్నీ సాధ్యమయ్యాయని అన్నారు. చిన్నతనంలో ఎంత మంచి నడవడికను అలవాటు చేసుకుంటే ఎదిగాక సమాజానికి అంత విలువ ఇస్తాం అనేది నేర్చుకున్నానని, తనకు టీచర్లు చెప్పిన పాఠాలు ఇప్పటికీ గుర్తున్నాయన్నారు. ఈ సందర్భంగా తన బాల్యమిత్రులను పెమ్మసాని కలుసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

రావిపాడు వాసుల నుంచి పెమ్మసానికి అపూర్వ స్వాగతం లభించింది. చర్చి ఫాదర్లు ఆయనను ఆశీర్వదించారు. గ్రామ పెద్దలు, టీడీపీ నేతలు చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పూదోట సునీల్, నాగోతు శౌరయ్య, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

❐ ప్రసాద్ అగ్రిటెక్ శంకుస్థాపనలో పెమ్మసాని

ప్రత్తిపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువతకి ఉపాధి కల్పించడమే లక్ష్యమని, అందులో భాగంగానే కాకుమానులో ప్రసాద్ అగ్రిటెక్ ఇన్నోవేషన్ సెంటర్‌కు పునాది పడుతోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కాకుమానులో ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రసాద్ అగ్రిటెక్ ఇన్నోవేషన్ సెంటర్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే, కారుమంచి ప్రసాద్ తల్లిదండ్రులు కోటయ్య, నాగరత్నమ్మల జ్ఞాపకార్థం నిర్మించిన కమ్యూనిటీ హాలును, జడ్‌పీ హైస్కూల్ నూతన భవనాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ డ్రోన్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా వెయ్యి మందికి ఎంప్లాయిమెంట్ కల్పించాలనేదే లక్ష్యమని, దేశ వ్యాప్తంగా వీరి సేవల ద్వారా ఎంతో ఉపయోగం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ప్రత్తిపాడు ఈ ట్రైనింగ్ సెంటర్ ద్వారా వేల మందికి ఉపాధి దొరుకుతుందని అన్నారు. కారుమంచి ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పుల దృష్ట్యా యాంత్రీకరణ వైపు దృష్టి పెట్టినట్టు తెలిపారు.భవిష్యత్తులో కాకుమాను డ్రోన్‌ల హబ్‌గా తయారవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కే నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్ సునీల్ చౌదరి, జడ్‌పీటీసీ గుల్జార్ బేగం, ఎస్.పూర్ణచంద్రరావు, సంగం డెయిరీ డైరెక్టర్ డీ వెంకట సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ఎం రాంగోపాల్ పాల్గొన్నారు.



ప్రసాద్ అగ్రిటెక్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, చిత్రంలో ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్, ఎమ్మెల్యే రామాంజనేయులు

నాగమ్మ దేవాలయం పునర్నిర్మాణానికి చర్యలు

టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నాగమ్మ గుడి సమీపంలో శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రాయశ్చిత్త యజ్ఞం పూర్తిచేశారు. ప్రభుత్వ నిధులతో ఆలయ నిర్మాణం



తాళ్లాయపాలెం పీఠాధిపతి శివస్వామిని శాలువాతో సత్కరించి ఆహ్వానిస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూరి

చేపట్టడంతో పాటు పల్నాడు చరిత్ర, వైభవం ఈ ప్రాంత ప్రాశస్త్యం, నాయకురాలు నాగమ్మ పరిపాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, వీరోచిత గాథలు భావితరాలకు తెలిసే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. నాగమ్మ దేవాలయానికి 24 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో కొంతమేరకు ఆక్రమణలకు గురికాగా మిగిలిన భూమి ఆలయానికి చెందేలా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో పదకొండవ శతాబ్దంలో పల్నాటి నాగమ్మ నిర్మించిన శ్రీ చెన్ను మల్లికార్జునస్వామి దేవాలయాన్ని ఆదివారం పురావస్తుశాఖ, దేవాదాయశాఖ అధికారులు టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తితో కలిసి సందర్శించారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులోని ఈ ఆలయాన్ని తాళ్లాయపాలెం కోటిలింగాల క్షేత్ర పీఠాధిపతి శివస్వామి పర్యవేక్షణలో మార్చి 14న జీర్ణోద్ధరణ చేసి పునఃప్రతిష్ఠ జరపాలని జంగా కృష్ణమూర్తి సంకల్పించారు. ఈ నేపథ్యంలో చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పురావస్తుశాఖ ఏడీ నరసింహనాయుడు, పల్నాడు జిల్లా దేవాదాయ శాఖ అధికారి కే వీరాంజనేయులు, రెవెన్యూశాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టడంతో పాటు దాతల సహకారాన్ని కూడా తీసుకోనున్నట్లు జంగా తెలిపారు. కార్యక్రమంలో దాచేపల్లి మండల దేవదాయ శాఖ ఈఓ నెమలిరెడ్డి, రెవెన్యూశాఖ ఆర్ఐ శరత్‌కుమార్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, గామాలపాడు సర్పంచ్ జంగా సురేష్, పల్నాడు చరిత్ర పరిరక్షణ కమిటీ సభ్యులు బెహరా వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విభజన హామీల సాధనకు రాజీ లేని పోరాటం

ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. గుంటూరులోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం అనే వారు రాష్ట్ర ద్రోహులు అని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం స్థిరపడేందుకు కొంత సమయం ఇచ్చామే కానీ, ప్రత్యేక హోదా ఉద్యమం ఆగలేదని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకి ప్రత్యేక ప్యాకేజీ కింద కేంద్రం ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని గుర్తుచేశారు. రాజధాని నిర్మాణానికి ఇస్తామన్నా నిధులు కేంద్ర సహాయమా లేక రుణమా అనే విషయంపై స్పష్టత లేకపోవడం విచారకరమని అన్నారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆస్తిపై కాకుండా విభజన హామీల సాధనపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి బీజేపీ చేస్తున్న మోసాన్ని చంద్రబాబు గ్రహించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడం కన్నా రాష్ట్రంలో ఉన్న విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి కాపాడుకోవాలని సూచించారు. విద్యుత్ రంగాన్ని బడా బాబులకు కట్టబెట్టే కన్నా ఏపీ జెన్కోకి అప్పగిస్తే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. రేషన్‌కి బదులు నగదు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ఇది సరైన విధానం కాదని విమర్శించారు. ట్రేడింగ్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రానికి ఆదాయం పెరగడంతో పాటు రైతుకు మేలు జరుగుతుందని సూచించారు. సమావేశంలో సీపీఐ నాయకులు జంగాల అజయ్‌కుమార్, మేడా హనుమంతురావు, టీ నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్, పాల్గొన్న జంగాల అజయ్‌కుమార్ తదితరులు

కాలనీలు.. పునాదుల్లోనే..

● పేరుగొప్ప ఊరుదిబ్బగా జగనన్న కాలనీలు

(5వ పేజీ తరువాయి)

మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు విఫలమయ్యారు. ఆర్భాటంగా స్థలాలిచ్చి అధికారులకు లక్ష్యాలు పెట్టి లబ్ధిదారులపై ఒత్తిళ్లు తెచ్చినా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగాయి. దీంతో అత్యధిక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు అరకొరగానే జరిగాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వీలైనన్ని ఎక్కువ ఇళ్లు పూర్తి చేయించి ఫిబ్రవరిలో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని గత ప్రభుత్వం నిర్ణయించినా లబ్ధిదారుల నుంచి స్పందన రాలేదు. స్థలాలు పోతాయోమోనని కొందరు లబ్ధిదారులు పునాదులు వేసుకుని వదిలి వేశారు. మరికొందరు కనాకష్టంగా ఇల్లు కట్టుకుంటే రవాణా, ఇతర సౌకర్యాలు కల్పించలేదు. కాలనీలకు మౌలిక వసతుల కల్పన గాలికొదిలేశారు. ఇళ్ల నిర్మాణం అంశంలో వైసీపీ ప్రభుత్వం చెప్పిన గొప్పలు ఆచరణలో కనిపించలేదు. కొన్ని నెలలుగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది.

సౌకర్యాలు నాస్తి..

ఆయా కాలనీల్లో పూర్తయిన ఇళ్ళల్లో నివాసం ఉండలేని పరిస్థితులు నెలకున్నాయి. మౌలిక వసతుల కల్పన జరగకపోవడం, ఊరికి దూరంగా ఇళ్లు ఉండటం, రహదారులు, రవాణా సౌకర్యాలు, తాగునీరు అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో ఇళ్లల్లో నివాసం ఉండలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పూర్తయిన గృహాలకు కనీసం విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని, ప్రధాన రహదారుల నిర్మాణాలను పూర్తిచేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కాలనీల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువలు నిర్మించే విషయంలో తీవ్రజాప్యం జరుగుతోంది. వర్షం కురిస్తే రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనకు కూడా నిధుల కొరత వెంటాడుతోంది. ఇంటి నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులు నివాసం ఉండేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. అద్దెగృహాల్లోని నేటికి కాలం గడుపుతున్నారు.

ప్రచారం.. ప్రహసనం

పేదలకు సొంతింటి కల సాకారం పేరుతో జగనన్న కాలనీలను నిర్మిస్తున్నామని గత ప్రభుత్వం చేసిన ప్రచారార్భాటం అంతా ఇంతా కాదు. జగనన్న కాలనీల పేరిట నడచిన ప్రహసనం పేదలకు ఎన్నో సమస్యలను తెచ్చిపెట్టింది తప్పితే ఇళ్లు పూర్తి అయిన దాఖలాలు అరకొరే. తొలుత జగనన్న లేఅవుట్లకు భూమి కొనుగోళ్లతో ప్రారంభమైన దందా తర్వాత లబ్ధిదారుల ఎంపిక, ప్రభుత్వం అందించే అరకొరసాయంతోనే నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులపై ఒత్తిళ్ళ, ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే కాంట్రాక్టుల విషయంలో లొసుగులు, ఇళ్లు కట్టుకోకపోతే స్థలాన్ని తీసేసుకుంటామనే బెదిరింపులు ఇలా ఒకటేమిటి జగనన్న ఇళ్ల పేరిట ఎంతోమంది నిరుపేదలు అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పోసొప్పో చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేసినవారికి అక్కడ కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా గత ప్రభుత్వం పూర్తిగా విఫలమవడంతో జగనన్న కాలనీల వల్ల పేదలకు ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నాగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల పేరిట జరిగిన దోపిడీపై విచారణ జరిపించడమే కాకుండా ఇప్పటికే ఇళ్లు పూర్తి చేసుకున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

గుంటూరు మీదగా మరిన్ని శబరి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మకరవిలక్కు పండగకు శబరిమలకు వెళ్లే అయ్యప్పభక్తుల సౌకర్యార్థం మరిన్ని రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు. నంబరు. 07167 మౌలాలి -కొట్టాయం ప్రత్యేక రైలు జనవరి 3, 10, 17, 24, 31(ప్రతి శుక్రవారం) మధ్యాహ్నం 2.30కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, తెనాలి, చీరాల మీదగా మరుసటి రోజు సాయంత్రం 6.45కి కొట్టాయం చేరుకొంటుంది. నంబరు. 07168 కొట్టాయం - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు జనవరి 4, 11, 18, 25, ఫిబ్రవరి 1 తేదీల్లో(ప్రతి శనివారం) రాత్రి 9.45కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై ఆదివారం అర్ధరాత్రి దాటాక 1.30కి సికింద్రాబాద్‌కు చేరుకొంటుంది. అలానే నంబరు. 07169 కాచీగూడ - కొట్టాయం ప్రత్యేక రైలు జనవరి జనవరి 5, 12, 19, 26(ప్రతి ఆదివారం) మధ్యాహ్నం 12.30కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా ప్రయాణించి సోమవారం సాయంత్రం 6.50కి కొట్టాయం చేరుకొంటుంది. నంబరు. 07170 కొట్టాయం - కాచీగూడ రైలు జనవరి 6, 13, 20, 27 తేదీల్లో(సోమవారం) రాత్రి 8.50కి బయలుదేరి మంగళవారం అర్ధరాత్రి దాటాక 1 గంటకు కాచీగూడ చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైళ్ల సర్వీసులను యాత్రికులు వినియోగించుకోవాలని డీఆర్ఎం ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

విదర్భపై కర్ణాటక ఘనవిజయం



ఐదు వికెట్లు తీసిన ధ్యాన్ హిరేమత్

మంగళగిరి సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో విదర్భ జట్టుపై కర్ణాటక ఆరు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. రెండు వికెట్ల నష్టానికి వంద పరుగులతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన విదర్భ జట్టు కేవలం 156 పరుగులకే ఆలౌట యింది. విదర్భ బ్యాటర్ కుష్ శర్మ 41 పరుగులు చేయగా, కర్ణాటక బౌలర్ ధ్యాన్ హిరేమత్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 182 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు 51.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కర్ణాటక బ్యాటర్లు జే.సుకృత్ 81 పరుగులు, ఆరుష్ జైన్ 49 పరుగులు సాధించారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో మహిళ హత్య

సత్తెనపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళ హత్యకు గురైన సంఘటన పట్టణంలోని పాకాలపాడు రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈ హత్యకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని రంగాకాలనీకి చెందిన తోకల రమాదేవి(35), రాజుపాలెం మండలం కొత్తూరుకి చెందిన వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. రమాదేవి కుమార్తె స్థానిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తుంది. పాఠశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం ఉండటంతో రమాదేవితో వివాహేతర సంబంధం ఉన్న వ్యక్తి ఆమెను పాఠశాల దగ్గరకు వెళదామని చెప్పి ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్ళాడు. శనివారం సాయంత్రం రమాదేవి కుటుంబసభ్యులు ఆమె ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో, ఆ వ్యక్తికి వారు ఫోన్ చేసినా సమాధానం రాలేదు. రమాదేవి కుటుంబ సభ్యులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం పాకాలపాడు రోడ్డులో రమాదేవి మృతదేహం పడి ఉండటాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. పట్టణ సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐ సంధ్యారాణిలు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకట్రావుని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



ముశ్యం రామకృష్ణ (ఫైల్‌ఫొటో)

దాచేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గతంలో చేసిన అప్పులు తీర్చలేక ప్రస్తుతం సాగుచేసిన పంటలు చేతికొచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం దాచేపల్లి నగర పంచాయతీలోని ఎంఎస్ పేటలో జరిగింది. మృతుడు ముశ్యం రామకృష్ణ (48) గతంలో రూ.15 లక్షలకు పైగా అప్పులు చేశాడు. ఈ ఏడాది నాలుగున్నర ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని పత్తి, మిరప పంటను సాగు చేస్తున్నాడు. అయితే, పంట దిగుబడి సరిగా రాకపోవడం, అప్పులు పెరిగిపోవడం, రుణదాతల నుండి ఒత్తిడి రావడంతో శనివారం సాయంత్రం పంట పొలంలో పురుగుమందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందించారు. చికిత్స పొందుతున్న రామకృష్ణ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. రామకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దాచేపల్లి సీఐ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	106,114,125
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

దక్షిణ భారత జోన్ బాడీ బిల్డింగ్ పోటీలకు నగర యువకులు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత జోన్ బాడీ బిల్డింగ్ పోటీలకు నగరానికి చెందిన ఇద్దరు యువకులు ఎంపికయ్యారు. స్థానిక కొరిటిపాడు సెంటర్‌లోని ఆంధ్రా వ్యాయామశాలకు చెందిన మామిడాల హరి హరన్, నూర్ ఆశిక్‌లు ఎంపికైనట్లు గుంటూరు బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి గల్లా శ్రీనివాసరావు తెలిపారు. హిందూ కళాశాలకు చెందిన హరి హరన్, మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో చదువుతున్న ఆశిక్‌లు 65, 55 కేజీల కేటగిరీలో జిల్లా తరపున ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 13, 14 తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలోని తిరువళ్లూరులో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోచ్ జమ్ముల శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు.



స్తంభాలగరువు కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన సద్దిలో భోజనం స్వీకరిస్తున్న అయ్యప్ప దీక్షాపరులు

కోదండ రామాలయంలో ముగిసిన సద్ది

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్తంభాలగరువు కోదండ రామాలయంలో వరుసగా 13వ సంవత్సరం అయ్యప్ప భక్తులకు 40 రోజుల పాటు కొనసాగిన సద్ది ఆదివారంతో ముగిసింది. శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ సమితి సౌజన్యంతో వేలాది అయ్యప్ప భక్తులకు ముగింపు సద్ది కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యం 2 వేల మందికి పైగా అయ్యప్ప భక్తులు సద్దికి వచ్చారని నిర్వాహకులు చెప్పారు. సద్ది నిర్వహణకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



మోడల్ పేపర్స్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

పది విద్యార్థులకు ఉపయుక్తంగా యూటీఎఫ్ మోడల్ పేపర్లు

● ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

గుంటూరు(విద్య), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ; పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీవిద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలోమోడల్‌పేపర్ బుక్స్ విడుదల చేయడం హర్షణీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం మోడల్ పేపర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మోడల్ పేపర్స్ రూపొందించారని, అన్ని స్థాయిల విద్యార్థులకు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. ఇరవై నాలుగేళ్లుగా ప్రతీ సంవత్సరం పదో తరగతి విద్యార్థుల ప్రయోజనం కోసం యూటీఎఫ్ మోడల్ పేపర్స్ తయారు చేసి అందించడం అభినందనీయమని అన్నారు. యూటీఎఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు మాట్లాడుతూ మారిన సిలబస్ ప్రకారం ఏడు పేపర్స్ విధానంలో పుస్తకం అందుబాటులోకి తీసుకువచ్చా యని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూ రాజశేఖర్ రావు, ఎం కళాధర్ మాట్లాడుతూ విద్యార్థులకు సోమవారం నుంచి ఇవి అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఎం గోవిందయ్య, కే రంగారావు, బీ ప్రసాదు,కే ప్రేమ్ కుమార్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ ఏసోబు, గఫార్, బాజిబాబా, జే రమేష్, రామకృష్ణ, కే శ్రీనివాసరావు, గోపయ్య, ఆదాం సాహెబ్ పాల్గొన్నారు.



అభ్యుదయ గీతం ఆలపిస్తున్న విద్యార్థిని, వేదికపై అరసం నాయకులు

విద్యార్థులకు అభ్యుదయ గీతాల పోటీలు

గుంటూరు(తూర్పు), డిసెం బరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎల్‌బీఈడీ కళాశాల ఆవరణలో విశాలాంధ్ర పుస్తక మహోత్సంలో అభ్యుదయ రచయిత సంఘం (అరసం) ఆధ్వర్యంలో విద్యా ర్థులకు అభ్యుదయ గీతాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కథా, నవలా రచయిత పెనుమాక నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. పోటీలలో పలు పాఠ శాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు కొణతం నాగేశ్వరరావు మాట్లాడుతూ అభ్యుదయ గీతాలుతో మనుషులు చైతన్యవంతులుగా మారతారని అన్నారు. కార్యక్రమంలో అరసం జిల్లా కార్యదర్శి బుల్లా రవి పాల్గొన్నారు.

సండే స్కూల్ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేటలోని కుగ్లర్ కాంపౌండ్‌లో గల ట్రినిటి పారిస్ చర్చిలో ఆదివారం సండేస్కూల్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రీస్తు పుట్టుక సందర్భంగా రెవరెండ్ డాక్టర్ సి. హెచ్. డానియల్ కుమార్, క్రిస్మస్ వర్తమానంతో అందరిని ఉజ్జీవపరిచారు. బాల, బాలికలు క్రీస్తు జననం అనే నాటిక ప్రదర్శించారు. స్థానిక సంఘ కాపరులు రెవరెండ్ దైవాశీర్వాదం, రెవరెండ్ రమేష్ ప్రజలందరి కోసం, లోక శాంతి కోసం ప్రార్థనలు చేశారు. చిన్నారులకు పండగ శుభాకాంక్షలు చెప్పారు.

కుప్పకూలిన వ్యవస్థలను గాడిన పెడుతున్నాం

● రూ. 77.29 కోట్ల అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి పెమ్మసాని శంకుస్థాపన

● రహదారులు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన

గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) వైసీపీ హయాంలో కుప్పకూలిపోయిన వ్యవస్థలన్నింటినీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కటిగా గాడిన పెడుతూ వస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక 46వ డివిజన్‌లోని నగరాలు ప్రాంతంలో ఉన్న హసిని ఇన్ ఫ్రా రహదారికి ఇరువైపులా సీసీ డ్రెయిన్లు, రహదారి నిర్మాణాల నిమిత్తం రూ.45.69 లక్షల అంచనాతో, 47వ డివిజన్‌లోని గోరంట్లలో కుమ్మరి బజారు ప్రాంతంలో సీసీ డ్రెన్లు, సీసీ రహదారుల నిర్మాణం నిమిత్తం రూ. 1.13 కోట్ల అంచనాలతో నిర్మాణాలకుఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి పెమ్మసాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ సుమారు 240 పనులకు గాను రూ. 77.29 కోట్లు గుంటూరు కార్పొరేషన్ పరిధిలో మంజూరు చేయించినట్లు చెప్పారు. గుంటూరు శివారు ప్రాంతాల్లో ప్రధాన సమస్య అయిన తాగునీటి సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని, ఏ ఇతర సమస్యలు ఉన్న కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాబోయే ఆరు నెలల్లో చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు పత్తిపాడు నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, స్థానిక కార్పొరేటర్ నూకవరపు బాలాజీ, వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

18 అడుగుల ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ఎన్జీఓస్ కాలనీలో ఏర్పాటు చేసిన 18 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. తెలుగుదేశంపార్టీని స్థాపించిన 9 నెలలల్లోనే పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు పెట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. బడుగు,బలహీన వర్గాలకు అండగా ఉండి రాజకీయంగా, ఆర్థికంగా పైకి తీసుకు వచ్చిన నాయకులు ఎన్టీఆర్ అని తెలిపారు. 'కూడు, గుడ్డ, గూడు' అనే నినాదంతో రాజకీయాల్లోకి వచ్చిన ఎన్టీఆర్ ముఖ్యంగా తెలంగాణాలో పటేల్, పట్వారీ వ్యవస్థను రూపుమాపి పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, తెలంగాణలో



18 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు మాధవి, రామాంజనేయులు

బడుగు బలహీన వర్గాలకు నిజమైన స్వాతంత్ర్యం ఇచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించాలని ప్రతి ఆంధ్రుడు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మద్దిరాల మ్యాని, కసుకుర్తి హనుమంత రావు, గళ్ళ రామచంద్రరావు, నిమ్మల శేషయ్య, రవి, శివ, శివాజీ, కొండలు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేకు విస్తృత ప్రచారం కల్పించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కరాటేతో స్వీయ రక్షణ ఏర్పడుతుందని, ఈ క్రీడకు విస్తృత ప్రచారం కల్పించాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. పోటీలలో విజేతగా ఆంధ్రప్రదేశ్,



రోడ్డు నిర్మాణ పనుల శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు

రన్నర్‌గా తమిళనాడు నిలిచాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ కరాటేలో బాలురు కంటే బాలికలు మరింత ప్రావీణ్యం సాధించాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ కరాటేలో రాణించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పోటీల ఆర్గనైజర్, సీనియర్ కోచ్ కే సురేష్ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ, ఒరిస్సా, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. అండర్-8, 10, 14, 16, 18 బాల, బాలికలు, మహిళలు, పురుషుల విభాగాల్లో ఈ పోటీలు జరిగాయని అన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిరాల మ్యానీ, కోచ్‌లు డీ ప్రభాకర్, శేకర్, అనిల్, జాషువా, శిరీష పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, పాల్గొన్న ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు



వెంగళరావునగర్ మునిసిపల్ హైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో పాల్గొన్న డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

దళితులను అందలమెక్కించేది చదువు మాత్రమే

● ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దళితులను అందలమెక్కించేది చదువు, ప్రభుత్వ ప్రణాళికలు మాత్రమేనని ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఆదివారం స్థానిక 53వ డివిజన్ వెంగళరావునగర్ మున్సిపల్ కార్పొరేషన్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ దళితులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలోని పాఠశాలలో చదువుతున్న పిల్లలు అన్ని రంగాల్లో అగ్రగాములుగా నిలవాలన్నారు. ఇందుకు చదువు ఒక్కటే మార్గమని, ఆ చదువుని ప్రోత్సహించే తెలుగు దేశం ప్రభుత్వం విద్యపై చూపించే శ్రద్ధ మాత్రమేనని తెలియజేశారు. తన జీవితంలో కూడా విద్య గొప్ప పాత్ర పోషించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన తాను ఈ రోజు దేశ,విదేశాల్లో ఉన్నతమైన డాక్టర్ సేవారత్న బిరుదుతో పాటు అనేక గౌరవాలు పొందానన్నారు. రాజకీయ పరంగాను అత్యున్నతమైన స్థానంలో ఉండటానికి కారణం కేవలం చదువేనని అన్నారు. సబ్‌ప్లాన్ కింద పాఠశాల అభివృద్ధికి రూ. 50 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులకు నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పీ రమేష్, దయారత్నం, నోడల్ ఆఫీసర్ కోటయ్య, విద్యా కమిటీ చైర్‌పర్సన్ వీ త్రివేణి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అన్నమయ్య సంకీర్తన లహరి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం అన్నమయ్య సంకీర్తన లహరి కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ కళాకారిణి ఉషారాణి బృందం అన్నమయ్య సంకీర్తనలు శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వీరికి వయోలిన్ పాలేటి గోవర్ధన్ రావు, మృదంగం కెవి కిషోర్ చక్కటి వాయిద్య సహకారం అందించారు.



కీర్తనలు ఆలపిస్తున్న ఉషారాణి బృందం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, విశ్రాంత వీసీ వియన్నారావు, రచయిత కంచె ఐలయ్య షెపర్డ్

క్లస్టర్ బాంబు కంటే శక్తివంతం కంచె ఐలయ్య పుస్తకం

● 'ది శూద్ర రెబలియన్' పుస్తకావిష్కరణ సభలో మాజీ మంత్రి డొక్కా

గుంటూరు(విద్య),డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్లస్టర్‌బాంబు కంటే శక్తివంతంగా ప్రొఫెసర్ కంచె ఐలయ్య తాజా పుస్తకం 'ది శూద్ర రెబలియన్' ఉందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో ఆదివారం ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది వై కోటేశ్వరరావు(వైకే) అధ్యక్షత వహించారు. మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ హమాస్‌పై ఇజ్రాయేల్ ప్రయోగించిన క్లస్టర్‌బాంబు నేరుగా వారి శత్రుశిబిరాలనే విధ్వంసం చేసిందని, ఈ పుస్తకం కూడా సమాజంలో శ్రమజీవులపై అగ్రవర్ణాలు అనుసరించే విధానాలను ప్రశ్నించేలా ఉంటుందని, ప్రజల్లో చైతన్యం నింపేలా ఉందని అన్నారు. ఈ పుస్తకం సమాజంలోకి చొచ్చుకునిపోయిన తర్వాత ప్రజల్లో మార్పు తీసుకువస్తుందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత వీసీ వియన్నారావు ప్రసంగిస్తూ సమాజం అణగారిన వర్గాల గురించి ఆలోచింపచేసేలా పుస్తకం ఉందన్నారు. వ్యవసాయదారులను స్ఫూర్తిగా తీసుకుని పుస్తక రచన చేయడం అభినందనీయమన్నారు.

ఏడు నెలలు పోరాడిన రైతుల స్ఫూర్తితోనే ఈ పుస్తకం

ఢిల్లీలో దాదాపు ఏడు నెలల పాటు పోరాటం చేసిన రైతులే తన తాజా పుస్తకం 'ది శూద్ర రెబలియన్'కు స్ఫూర్తిప్రదాతలని పుస్తక రచయిత కంచె ఐలయ్య అన్నారు. దేశ సంస్కృతిక పునాది వేదం కాదని రైతుల పనిముట్లే అని అన్నారు. తన దృష్టిలో సమాజంలో అన్ని వర్గాలు శూద్రులేనని, వారు పూర్వాశ్రమంలో శ్రమజీవులేనని అన్నారు. మనిషి మనసులో 'కులం' అనే విష బీజాన్ని తొలగించి సమాజంలో అన్ని వర్గాల వారు సమానమే అని చాటిచెప్పడమే లక్ష్యమని అన్నారు. సమావేశంలో సామాజిక కార్యకర్త లీలాకుమారి, గీతారామ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై ఉద్యమించండి: సీపీఎం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపడాన్ని ప్రజలందరూ ఐక్యంగా వ్యతిరేకించాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు బి.ముత్యాలరావు పిలుపు నిచ్చారు. స్థానిక 41వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్యనగర్‌లో ఆదివారం ప్రజలు విద్యుత్ బిల్లులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు దానిని పక్కనపెట్టారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తోందని అన్నారు. అదానీతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోనె లూథర్ పాల్, ఆది నికల్సన్, సీపాన పద్మనాభుడు, ప్రభుదాస్, గాలీబ్ బీ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాంద్‌బాషా, పాల్గొన్న సంఘ సభ్యులు

12వ వేతన సవరణ కమిటీని నియమించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 12వ వేతన సవరణ కమిటీని నియమించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా కోరారు. మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ వేతన సవరణ కమిటీ ముగిసి 18 నెలలు గడిచిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని 12వ కమిటీని నియమించాలని కోరారు. అంతకుముందే ఉద్యోగులకు, పెన్షనర్లకు ఐఆర్ 28 శాతం ప్రకటించాలని, రెండేళ్లుగా ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అందాల్సిన సదుపాయాలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కరీముల్లా షాఖాదరి, పోతురాజు, మురళీకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న సంఘం నాయకులు

రాష్ట్ర విశ్రాంత పారామిలటరీ, సైనికుల సంక్షేమ సంఘం వెబ్‌సైట్ ప్రారంభం

గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర విశ్రాంత పారామిలిటరీ, విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం నగరంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ నాయకులు ప్రత్యేక వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యుఏపీపీఏఆర్ఏఎమ్ఐఎల్ఐటిఏఆర్‌వై. వోఆర్‌జీ ద్వారా లాగిన్ కావచ్చని సూచించారు. ఈ వెబ్‌సైట్‌లో సీఏపీఎఫ్ వెల్ఫేర్‌కి సంబంధించిన విషయాలు/పాలసీలు పొందుపరిచినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ వెబ్‌సైట్‌ను పారామిలిటరీ జవాన్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పోటీలలో పాల్గొన్న బాల, బాలికలు

బాలబాలికలకు చిత్రలేఖనం, భక్తి పాటల పోటీలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్‌నగర్‌లోని రామనామ క్షేత్ర ఆలయప్రాంగణంలో ఆదివారం బాల,బాలికలకు వార్షిక కంఠ పాట, చిత్రలేఖన, భక్తి పాటల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన బాల, బాలికలు అధికసంఖ్యలో హాజరయ్యారు. పోటీలను ఆలయ కార్యనిర్వాహకులు రాగం వెంకట లీలా సుందరి, మస్తాన్‌రావు, సభ్యులు కేవీ సుబ్బారావు, బీజయశంకర్, బీ రామకృష్ణ పర్య వేక్షించారు. ఆయా పోటీలలో విజేతలకు ఈ నెల 19న సంఘ వార్షిక సభలో బహుమతులు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అనంతరం బాల, బాలికలకు యోగదా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రసాదాలు, భగవద్గీత అందజేశారు.

రోడ్లపైకి వచ్చేలా ర్యాంపుల నిర్మించొద్దు

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మించే బహుళ అంతస్తు భవనాలకు చెందిన ర్యాంపులు రోడ్లపైకి వచ్చేలా నిర్మించవద్దని, డ్రెయి న్లపై నిర్మాణాలు చేపట్టవద్దని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. స్థానిక గోరంట్ల, రెడ్డిపాలెం ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ)కి దరఖాస్తు చేసుకున్న భవనాలను ఆదివారం కమిషనర్ పరిశీలించారు. సెట్ బ్యాక్, రోడ్డుల కొలతలు, ర్యాంప్‌లు, డ్రెయిన్లపై ఆక్రమణలను తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైనేజి లైన్‌ని మేజర్ డ్రైన్ లోకి కనెక్ట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయబోమని స్పష్టం చేశారు. నిబంధనల మేరకు బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణాలు జరగాలని, లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవనాలను నిర్మాణ దశలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలించాలని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు కూడా పెట్టకూడదని, అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే వాచ్ మెన్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్టుమెంట్ నిర్వాహకులే డ్రైనేజి లైన్ ను మేజర్ డ్రైన్ వరకు కనెక్ట్ చేసుకోవాలన్నారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రెహ్మాన్, మల్లికార్జున, టీపీఎస్‌లు లక్ష్మణస్వామి, సత్యనారాయణ, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు



సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి

క్రీస్తు బాటలో నడవాలి: ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు చూపిన బాటలో అందరూ నడవాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి కోరారు. నియోజకవర్గంలో పలుచోట్ల శనివారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచమంతా కుల,మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని అన్నారు. సర్వ మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు. క్రీస్తు ప్రబోధించినట్లుగా ఇతరులపై ప్రేమ, దయ, కరుణ చూపాలని కోరారు. కార్యక్రమంలో బ్రదర్ ప్రణీత్, సిస్టర్ బూల్యా పాల్గొన్నారు.



నల్లచెరువులో పర్యటిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ సుప్రజ

నల్లచెరువులో కార్డెన్ సెర్చ్

● వేకువ జామునే కాలనీలో సోదాలు

● పత్రాలు లేని ఆటో సహా 78 వాహనాలు సీజ్

● పర్యవేక్షించిన ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ సుప్రజ

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లచెరువులో భారీగా పోలీసులు మోహరించడంతో కలకలం రేగింది. వేకువ జామునే పోలీసులు కాలనీని చుట్టుముట్టడంతో కాలనీలో ఏమి జరిగిందో అర్థం కాక స్థానికులు విస్మయానికి గురయ్యారు. కాలనీ నుంచి తనిఖీ చేయకుండా ఏ ఒక్కరినీ బయటకు వెళ్ళనీయలేదు. అంతేగాక ప్రతి ఇంటికీ వెళ్ళి తనిఖీలు నిర్వహించారు. పోలీసులు నిర్వహిస్తున్న కార్డెన్ సెర్చ్ ప్రక్రియను ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పీ సుప్రజ క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షించారు. ఆదివారం తెల్లవారుజమున 5 గంటల నుండి నల్ల చెరువులోని పలు ప్రాంతాలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి, పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తుల గృహాల్లో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాల యొక్క వివరాలు, వ్యక్తుల వివరాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తనిఖీ చేశారు. త్రినేత్ర అనే అప్లికేషన్ సహాయంతో వాహనాల నంబర్లను తనిఖీ చేయడం ద్వారా ఆ వాహనాలకు నిజమైన వాహనదారులు ఎవరో నిర్థారించారు. సుమారు 300 వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలు లేని ఆటోతో పాటు 77 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌కు తరలించారు. కార్డెన్ సెర్చ్ ప్రక్రియలో రౌడీషీటర్ల ఇళ్లను, గంజాయి కేసుల్లో నిందితుల ఇళ్లను తనిఖీ చేసి, సుమారు 70 మంది అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలు సేకరించారు. అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్టవేసేందుకు పోలీస్ శాఖ తరఫున ప్రణాళిక రూపొందించామని ఎస్పీ తెలిపారు. దీనిలో భాగంగా కార్డెన్ సర్చ్ నిర్వహించామని, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు అజీజ్, జయరాం ప్రసాద్, శివాజీ రాజు, లాలాపేట సీఐ శివప్రసాద్, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి సమాధిని సందర్శించి వస్తుండగా యువకుడి దుర్మరణం

మేడికొండూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం అతని తల్లి గుండెపోటుతో మరణించింది. తల్లిని మర్చిపోలేక ప్రతి ఏటా ఆమె సమాధి దగ్గరకు వెళ్లి వస్తుంటాడు. అదేవిధంగా తన తల్లి సమాధిని దర్శించుకొని వస్తున్న ఆ యువకుడిని మేడికొండూరు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ రూపంలో మృత్యువు కబళించింది. బెల్లంకొండ మండలం ఎమ్మాజీగూడెంనకు చెందిన ఓర్సు వీరసింక్ (19) గుంటూరులోని వెంకటరమణ కాలనీలో నివసిస్తూ మిర్చియార్డులో కూలీ పనులకు వెళుతుంటాడు. వీరసింక్ తల్లి గుండెపోటుతో మూడేళ్ల క్రితం మరణించింది. స్వగ్రామమైన ఎమ్మాజీగూడెంలో ఆమెను సమాధి చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా అతను ఎమ్మాజీగూడెం వెళ్లి తల్లి సమాధి వద్ద ప్రార్థన చేసి వస్తుంటాడు. అదేవిధంగా ఆదివారం తల్లి సమాధి వద్ద ప్రార్థన ముగించుకొని గుంటూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వీర సింక్ తల లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మరణించాడు. తండ్రి ఓర్సు అంజనేయులు ఫిర్యాదు ఆధారంగా మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. తన తల్లి గుర్తుకువస్తుందని, సమాధిని సందర్శించి వస్తానని చెప్పి వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.



విశాఖలో పారాగ్లైడింగ్

» విజయవంతమైన ట్రయల్‌రన్

సాగర్‌నగర్ (విశాఖపట్నం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని సందర్శించే పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు రుషికొండ బీచ్‌లో పారాగ్లైడింగ్ అందుబాటులోకి రానుంది. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో లెవెన్ అడ్వెంచర్స్ సంస్థ ఆదివారం నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ బీచ్‌లో ఇప్పటికే బోటుషికార్, స్కూబా డైవింగ్ తదితర అడ్వెంచర్స్ స్పోర్ట్స్ అందుబాటులో వున్నాయి. పారాగ్లైడింగ్ కొత్త అనుభూతిని అందించనుంది. నింగి, నేలను తాకుతూ సముద్రంలో ఎగసిపడే కెరటాలు... మరో పక్క ఎత్తైన కొండలను వీక్షిస్తూ నీలాకాశంలో విహరించడం పర్యాటకులకు మధురానుభూతినిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.

అనంత పోలీసుల కస్టడీలో బోరుగడ్డ

విచారణలో 'తెలియదు, గుర్తులేదు..' సమాధానాలు

అనంతపురం క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను అనంతపురం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఆయన్ను ఆదివారం తెల్లవారుజామున అనంతపురం తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులను అసభ్యకరంగా విమర్శిస్తూ బోరుగడ్డ యూట్యూబ్ చానల్‌లో మాట్లాడారని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ నిమిత్తం బోరుగడ్డను కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి కోర్టు నుంచి మూడు రోజుల కస్టడీ కోరారు. శనివారం అతనికి వైద్య పరీక్షలు అక్కడే నిర్వహించారు. కాగా, బోరుగడ్డ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన్ను తెల్లవారుజామున 1.20 గంటల సమయంలో పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా.. అప్పటికే అక్కడి లైట్లన్నీ ఆర్పేశారు. వచ్చీ రాగానే అనిల్‌ను లోపలకు తీసుకెళ్లారు. ఆదివారం సైతం పోలీసుస్టేషన్‌కు తాళం వేశారు.



విచారణకు సహకరించని అనిల్

విచారణలో అనిల్ పోలీసులకు సహకరించలేదని సమాచారం. 'తెలియదు.. పెద్దగా గుర్తులేదు..' అనే సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఆదివారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో విచారించారు. వీఆర్వోల ఎదుట స్టేట్‌మెంట్‌ను తీసుకున్నట్లు తెలిసింది. అనిల్ గతంలో మాట్లాడిన వీడియోల ఆధారంగా 'నువ్వే కదా ఈ వీడియోలో మాట్లాడింది' అని ప్రశ్నించినట్లు తెలిసింది. 3 రోజుల కస్టడీ తర్వాత అతనికి సోమవారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహించి, స్థానిక కోర్టులో హాజరుపరిచిన తర్వాత రాజమండ్రి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రయాణ సమయాన్ని చూపి మంగళవారం ఉదయం అక్కడి కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

» 11న రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు



విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం నాటికి స్థిరంగా కొనసాగుతోంది. దీనిపై ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండగా, ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సోమవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. తరువాత కూడా పశ్చిమ వాయవ్యంగా పయనించి ఈనెల 11వ తేదీనాటికి శ్రీలంక, తమిళనాడు తీరాలకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. దీని ప్రభావంతో 11వ తేదీన రాయలసీమలో విస్తారంగా, దక్షిణ కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆదివారం కోస్తా, రాయలసీమలో ఎక్కువ ప్రాంతాల్లో మేఘాలు ఆవరించి చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

అన్నదాతలను అప్రమత్తం చేయాలి: కలెక్టర్లకు సీఎం ఆదేశాలు

అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కల్లాల్లో ధాన్యం తడవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వరి కోతలు వాయిదా వేసుకునేలా అన్నదాతలను అప్రమత్తం చేయాలని ఆదివారం రాత్రి కలెక్టర్లు, జేసీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రైతులు నూర్చిన ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వరికుప్పలు, ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు రైతులు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని వ్యవసాయశాఖను ఆదేశించారు.

వెనక'బడి'ంది!

» ఒక్క పాఠశాలకూ దక్కని 5 స్టార్ రేటింగ్

» నాలుగు స్టార్లు దక్కిన బడులూ తక్కువే

» ఏకంగా 398 బడులకు జీరో స్టార్ రేటింగ్

» సర్కారు స్కూళ్లలో సదుపాయాల లేమి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చాలాచోట్ల మౌలిక సదుపాయాలు ఉంటే సరైన ఫలితాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగున్న చోట సదుపాయాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల అసలు ఈ రెండూ లేవు. అటు మౌలిక సదుపాయాలు, ఇటు ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన బడి రాష్ట్రంలో ఒక్కటీ లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెలుగు చూసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ బడుల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాల (లెర్నింగ్ అవుట్‌కమ్స్)కు ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. ఏ బడి ఏ స్థాయిలో ఉంది? అనే కోణంలో వివరాలు సేకరించడంతో ఇప్పటివరకూ వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రచారం అంతా ఉత్తదేనని తేలిపోయింది. బడుల్లో మౌలిక సదుపాయాలకు 5 స్టార్లు, అభ్యసన ఫలితాలకు 5 స్టార్లు ప్రామాణికంగా ఈ అధ్యయనం నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 45,087 ఉంటే... వాటిలో ఏ ఒక్కటి కూడా కనీసం ఒక విభాగంలోనూ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. మరోవైపు సదుపాయాల్లో 87, అభ్యసన ఫలితాల్లో 311 బడులకు అసలు రేటింగే దక్కని (జీరో రేటింగ్) దారుణమైన స్థితిలో ఉన్నాయి.

సొంత భజనతో సరి

రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు గత వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంది. 'నాడు- నేడు'తో బడి స్వరూపాన్ని మార్చేశామని జగన్ పదే పదే సొంత భజన చేసుకున్నారు. తీరా ఇప్పుడు మౌలిక సదుపాయాల విభాగంలో ఒక్క పాఠశాల కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. అదేవిధంగా అభ్యసన ఫలితాల్లో సైతం ఒక్కటీ ఫైవ్ స్టార్ సాధించకపోగా, కేవలం 41 పాఠశాలలు మాత్రమే ఫోర్ స్టార్ సాధించాయి. మిగిలిన 45 వేల పైచిలుకు బడులన్నీ త్రీ స్టార్, అంతకంటే తక్కువ స్థాయికే పరిమితమయ్యాయి.

> విద్యారంగంలో సంస్కరణల పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసం పాఠశాలలను దీన స్థితిలోకి నెట్టేసింది. చదువులను గాలికొదిలి టోఫెల్, బైజూస్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ చేసిన ప్రయోగాలు విద్యా ప్రమాణాలను దారుణంగా దెబ్బతీశాయి. విద్యార్థుల హాజరు, ఫలితాలను పట్టించుకోకుండా టీచర్లకు బోధనేతర బాధ్యతలు అప్పగించడంతో పాటు బోధన సమయాన్ని తగ్గించడంతో పిల్లల చదువులు అటకెక్కాయి. 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మార్చేస్తామని ప్రగల్భాలు పలికినా.. ఆ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో బడుల్లో మౌలిక సదుపాయాలూ అంతంతమాత్రంగానే ఉన్నాయని తేలిపోయింది. గత ప్రభుత్వం తీరుతో ఇప్పుడు పాఠశాలలు సింగిల్ స్టార్ దక్కించుకోవడానికే ఆపసోపాలు పడుతున్నాయి.

స్టార్ రేటింగ్ ఇలా...

మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. బడిలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడా మైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, తరగతి గదులు, తాగునీరు తదితరాలను పరిశీలించారు. ఒక్కో అంశానికి 5 చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన బడులకు 5 స్టార్లు కేటాయించారు. 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్ ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, గతేడాది పదో తరగతి పరీక్షల ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదో తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40 శాతం, ఫలితాలకు 60 శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండూ కలిపి 90 శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలున్న బడులకు 1 నుంచి 4 స్టార్లు కేటాయించారు.

అన్ని జిల్లాల్లోనూ అదే తీరు

ప్రభుత్వ పాఠశాలల స్థితి దాదాపుగా అన్ని జిల్లాల్లోనూ ఒకేలా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ జిల్లాలో 2,913 బడులకు గాను 161 చోట్ల మాత్రమే మౌలిక సదుపాయాలు పరవాలేదన్నట్టుగా ఉన్నాయి. అయితే అభ్యసన ఫలితాలు మాత్రం దిగజారిపోయాయి. ఈ విభాగంలో ఒక్క బడి కూడా నాలుగు స్టార్లు సాధించలేదు. అనకాపల్లి, అనంతపురం, బాపట్ల, కాకినాడ, కర్నూలు, ఎన్టీఆర్, నెల్లూరు, శ్రీసత్యసాయి, విశాఖ జిల్లాల్లోనూ ఒక్క పాఠశాలకూ నాలుగు స్టార్లు దక్కలేదు. ఎక్కువ పాఠశాలలు రెండు, మూడు స్టార్లతోనే సరిపెట్టుకున్నాయి.

బడులకు ఇచ్చిన రేటింగ్‌లు ఇలా..

స్టార్ రేటింగ్	మౌలిక సదుపాయాలు	అభ్యసన ఫలితాలు
జీరో స్టార్	87	311
ఒక్క స్టార్	1,958	14,095
టూ స్టార్	16,816	26,272
త్రీ స్టార్	19,438	4,368
ఫోర్ స్టార్	6,788	41
ఫైవ్ స్టార్	0	0

ఫలితాల్లేని సదుపాయాలెందుకు?

వైసీపీ ప్రభుత్వం బడులను రాజకీయ ప్రచారానికి వాడుకుంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను గాలికొదిలేసింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్లక్ష్యం చేసింది. టీచర్లకు నాడు- నేడు పనులు, మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతలు అప్పగించి బోధన సమయాన్ని తగ్గించింది. దీనిపై అప్పట్లో ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. కానీ జగన్ ప్రభుత్వం వారి ఆందోళనలను పెడచెవిన పెట్టింది. పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటేనన్నట్టుగా మార్చేసి, ఫలితాలను దిగజార్చింది.

నవ్య | చిత్రజ్యోతి

పోరాట వీరుడి కథ



విజయ్ సేతుపతి, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'విడుదల-2'. ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. నిర్మాత చింతపల్లి రామారావు ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్నారు. కాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను కథానాయకుడు విజయ్ సేతుపతి చెన్నైలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ "పెరుమాళ్ అనే పాత్రలో విజయ్ సేతుపతి అభినయం ఈ చిత్రానికి హైలెట్‌గా ఉండబోతోంది. పెరుమాళ్ పోరాట వీరుడిగా ఎలా మారాడు అనేది ఎంతో ఆసక్తికరంగా ఈ చిత్రంలో వెట్రిమారన్ ప్రజెంట్ చేశారు. తెలుగులో విజయ్ సేతుపతికి ఎందరో అభిమానులు ఉన్నారు. ఈ చిత్రంలో ఎమోషన్స్, యాక్షన్ అన్నీ రియాల్టీకి దగ్గరగా ఉంటాయి. ఇళయరాజా సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉంటుంది' అని అన్నారు. మంజువారియర్, సూరి, భవాని శ్రీ, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సూర్య సేతుపతి, అనురాగ్ కశ్యప్, రాజీవ్ మీనన్ తదితరులు ఈ చిత్రంలో నటించారు. కాగా, గతేడాది రిలీజైన 'విడుదల' పార్ట్ 1 చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకొని సూపర్ హిట్‌గా నిలిచింది.

యాక్షన్ థ్రిల్లర్




పూర్వజ్ దర్శకత్వం వహిస్తూ హీరోగా నటిస్తున్న చిత్రం 'కిల్లర్'. పూర్వజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్‌ను హైదరాబాద్, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. 10 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో హీరో పూర్వజ్, హీరోయిన్ జ్యోతి పూర్వజ్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొన్నారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో మరో హీరో విశాల్ రాజ్ పాల్గొంటారు. రామోజీ ఫిల్మ్ సిటీ, మొయినాబాద్ లొకేషన్స్‌లో జరిగే ఈ చిత్రీకరణలో గౌతమ్, జ్యోతి పూర్వజ్ పాల్గొంటారు.

డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్



తెలుగు ఫిల్మ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రకాశ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. అధ్యక్షుడిగా ప్రకాశ్ ఎన్నికవడం ఇది ఐదోసారి. కాగా, జానీని అధ్యక్షుడిగా తొలగించడంతో పాటు ఆయన సభ్యత్వాన్ని కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జానీపై పోక్సో కేసు విచారణలో ఉండటం, అసోసియేషన్‌లో జానీ ప్రవర్తన అగ్రెసివ్‌గా ఉండేదనే రిపోర్టు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

మోహన్‌బాబు.. మనోజ్ మధ్య గొడవ?





సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు ఆయన చిన్న కొడుకు మనోజ్‌కు మధ్య ఆస్తుల పంపకాల విషయంలో గొడవ జరిగినట్లు మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ విషయం సినీ ఇండస్ట్రీతో పాటు.. అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పహాడీషరీఫ్ పరిధిలోని మోహన్‌బాబు ఇంట్లో ఆస్తుల పంపిణీ జరుగుతున్న క్రమంలో స్కూలుకు సంబంధించిన వాటాల్లో విభేదాలు తలెత్తి మోహన్‌బాబు అనుచరులు వినయ్ ఇతర బౌన్సర్లు మనోజ్‌పై, ఆయన భార్య మౌనికపై దాడికి పాల్పడి గాయపరిచినట్లు.. గాయాలతోనే మనోజ్ తన భార్యతో కలసి పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయమై మహేశ్వరం డీసీపీని సంప్రదించగా డయల్-100కు కాల్ వచ్చిందని, వ్యక్తిగతంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. కాలుకు గాయం అయిన మంచు మనోజ్ తన భార్య మౌనికతో కలసి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. తండ్రితో జరిగిన గొడవ విషయమై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. మనోజ్, మౌనిక మాట్లాడటానికి నిరాకరించారు. కాగా, మనోజ్ ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో డిశ్చార్జి అయ్యారు. మనోజ్‌కు ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) పూర్తి చేసిన వైద్యులు ఆయన ఒంటిపై అనుమానాస్పద దెబ్బలు ఉండటంతో ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాలు, మెడ భాగంలో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారని తెలిసింది. సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్ పరీక్షలు పూర్తి చేసిన వైద్యులు 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉండాలని సూచించగా.. సోమవారం మరోసారి ఆస్పత్రికి వస్తానని మనోజ్ డిశ్చార్జి అయినట్లు తెలిసింది.

అంతా అబద్ధం : మోహన్‌బాబు

ఆస్తుల పంపకాల్లో మా ఇంట్లో గొడవలు జరిగాయని.. మనోజ్‌ను నేను కొట్టానని ఉదయం నుంచి మీడియాలో షికార్లు చేస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మోహన్‌బాబు తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేయొద్దంటూ మీడియాకు సూచించారు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

14న ఎన్టీఆర్ సినీ ప్రస్థాన వజ్రోత్సవం



నందమూరి తారకరామారావు సినీ ప్రస్థాన వజ్రోత్సవం ఈ నెల 14న పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో జరుగుతుందని ఆయన కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల చైర్మన్ టీడీ జనార్దన్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఫిల్మ్ చాంబర్ హాల్లో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో టీడీ జనార్దన్ మాట్లాడుతూ "సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్‌కు సాటి లేదు. కృష్ణుడిగా, రాముడిగా నటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన తొలిసారి నటించిన 'మనదేశం' చిత్రం 75 ఏళ్లు అయిన సందర్భంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 'మనదేశం' చిత్ర నిర్మాత కృష్ణవేణి, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ కుమారుడు రమేశ్ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పలువురు చిత్ర పరిశ్రమ ప్రముఖులు పాల్గొంటారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌తో పాటు 24 క్రాఫ్ట్‌తో పాటు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది" అని అన్నారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, సెక్రటరీ దామోదర్ ప్రసాద్, ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు అనుపమరెడ్డి, ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

- ధర్నాచౌక్, విజయవాడ (ఆంధ్రజ్యోతి)

ఒక్కసారి ప్రేమిస్తే చాలు




బాలీవుడ్ సీనియర్ నటి రేఖ రీసెంట్‌గా ఓ రియాల్టీ షోలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక అంశాలను పంచుకున్నారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే ప్రేమలో పడతారని కవులు తమ రచనల్లో రాస్తే...మరికొందరు మాత్రం ప్రేమకు ఆది, అంతం లేదంటున్నారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి అని యాంకర్ రేఖను ప్రశ్నించగా..'నా మటుకు, ఆ వ్యక్తి సరైన వాడైతే... ఒక్కసారి ప్రేమిస్తే చాలు' అని బదులిచ్చారు. మరో ప్రశ్నకు సమాధానంగా నిజమైన ప్రేమకు నిర్వచనం చెబుతూ 'ఎవరినైనా ప్రేమించండి, నా వరకైతే నేను మొదట అన్నిటినీ ప్రేమిస్తాను. నా వృత్తిని, నా స్నేహితులను, ఈ ప్రపంచాన్ని, ప్రకృతిని ఇలా...ప్రతీదాన్ని ప్రేమిస్తాను. కానీ, నన్ను నేను ఎక్కువగా ప్రేమిస్తా' అని చెప్పుకొచ్చారు. రేఖ మాటలు విన్న ప్రేక్షకులు ప్రశంసల జల్లు కురిపించారు.



మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి

ఇటీవలే 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ప్రస్తుతం ఆమె మరో వెబ్ సిరీస్ 'రక్త్‌బ్రహ్మాండ్'లో నటిస్తున్నారు. 'ద బ్లడీ కింగ్‌డమ్' అనేది ఉపశీర్షిక. తాజాగా, కొద్ది గ్యాప్ తర్వాత ఈ సిరీస్ సెట్స్‌లోకి ఆమె తిరిగి అడుగుపెట్టారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బ్యాక్ టూ యాక్షన్ మోడ్ అని పేర్కొన్నారు. 2018లో విడుదలైన హారర్ చిత్రం 'తుమ్‌బాడ్'తో గుర్తింపు తెచ్చుకున్న అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్యాంటసీ వెబ్‌సిరీస్‌ను రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్నారు. ఈ నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌లో ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫాజల్, వామికా గబ్బీ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.




అరకులో మాస్ జాతర

రవితేజ నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' అనేది ట్యాగ్‌లైన్. 'సామజవరగమన' రచయిత భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఆఫీసర్ పాత్రలో రవితేజ నటిస్తున్నారని వార్తలొస్తున్నాయి. సినిమా తాజా షెడ్యూల్ డిసెంబరు మూడో వారంలో అరకులో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఆ తరవాత పాడేరు, ఆంధ్రా-ఒడిషా సరిహద్దు లొకేషన్స్‌లో చిత్రీకరణ జరగనున్నట్లు తెలిసింది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అసత్య ప్రచారాన్ని ఆపండి

- రెహమాన్ కుమార్తె ఖతీజా



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన భార్య సైరా బానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయనపై పలు ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు రెహమాన్ కుటుంబ సభ్యులు తిప్పికొడుతూనే ఉన్నారు. అయితే రీసెంట్‌గా మరో వార్త వైరల్ అవుతోంది. వైవాహిక బంధానికి స్వస్తి పలికిన రెహమాన్.సంగీతానికి కొంత కాలం దూరంగా ఉండనున్నారంటూ కోలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. రెహమాన్ మ్యూజిక్‌ని మిస్ అవ్వాల్సిందేనా? అంటూ సోషల్ మీడియాలో ఆయన అభిమానులు పోస్టులు పెట్టారు. ఈ వార్తలపై ఇప్పటికే రెహమాన్ కుమార్తె ఖతీజా 'ఎక్స్' వేదికగా స్పందించారు. అయినా రూమర్లు ఆగకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మరోసారి రియాక్ట్ అయ్యారు. 'దయచేసి అసత్య ప్రచారాన్ని ఆపండి' అని విజ్ఞప్తి చేశారు. వార్తను ప్రచురించిన ఓ మీడియాను కోట్ చేస్తూ అలా రాయడం సబబు కాదన్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటి మట్టం ఉంది. కాగా దిగువకు 1450 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 72 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 154, పశ్చిమ కాల్వకు 54, నిజాంపట్నం కాల్వకు 116, కొమ్మమూరు కాల్వకు 1160 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పోలేరమ్మకు అభిషేకాలు నిర్వహిస్తున్న కమిటీ ప్రతినిధులు

మంగళగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాతమంగళగిరిలో ఉన్న గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయ 11వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. పోలేరమ్మకు అన్నాభిషేకం చేశారు. మంగళగిరి ప్రాంతంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వూట్ల పాలశ్రీనివాస్, కాంద్రు అమరలింగేశ్వరరావు, మునగాల రామారావు, వూట్ల రథంగపాణి, భవానీ ప్రసాద్, పంచల వసంతకుమార్, జగ్గారపు వెంకట నారాయణ, మునగాల ధనుంజయుడు, గుడిపూడి శివకృష్ణ, బిట్రా రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనసమారాధనలు



తులసి మొక్కకు పూజలు చేస్తున్న మహిళలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు తోటల్లో వనసమారాధనలు ఆదివారం ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయి. గత వారం కార్తీకమాసం ఆఖరి ఆదివారం నాడు భారీ వర్షాలు కురవడంతో రద్దయిన వనసమారాధన కార్యక్రమాలు ఈ ఆదివారం జరుపుకున్నారు. ఆత్రేయ మహర్షి గోత్రీకులైన దామర్ల వంశీకుల వనసమారాధన మహోత్సవం పెదవడ్లపూడి సమీపంలోని గోలి నాగశయనరావు తోటలో జరిగింది. దామర్ల కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై రోజంతా ఉల్లాసంగా గడిపారు. తొలుత అర్చకస్వాములు మహిళలచే తులసి చెట్టుకు పూజలు చేయించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహిళలు, చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. దామర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు.

నిర్మల మాత ఆలయ వార్షికోత్సవం



నిర్మల మాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్లు

మంగళగిరి సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పార్కు రోడ్డులోని నిర్మల మాత ఆలయ 33వ వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఆలయ ఫాదర్ ఏరువా బాల ఆధ్వర్యంలో 23 మంది ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మేరీమాత తేరు ఉత్సవం పార్కు రోడ్డులోని పుర వీధుల్లో ఘనంగా నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంఘ పెద్దలు, సంఘస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిలువూరు ఎస్సీకాలనీలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నూజివీడు సీడ్స్ అధినేత వెంకటరామయ్య

దుగ్గిరాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిలువూరులోని ఎస్సీకాలనీలో దాత, నూజివీడు సీడ్స్ అధినేత మండవ వెంకట్రామయ్య సహకారంతో వాటర్ ప్లాంట్ నిర్మించారు. ఎస్సీకాలనీలో సురక్షిత తాగునీటిని అందించేందుకు దాత వెంకట్రామయ్యను కోరగా స్పందించి ఆర్థిక సహకారం అందించి నిర్మాణం పనులు పూర్తి చేశారు. వాటర్‌ప్లాంట్ దాత వెంకట్రామయ్యను అభినందించి ఘనంగా సత్కరించి, ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ చిలువూరు రోజ మరియమ్మ, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, గ్రామ టీడీపీ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, పినపాటి కరుణాకర్, జీవన్, ఏసు పాదం, ఇందుపల్లి బాల, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పది మంది జూదరుల అరెస్టు

మంగళగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుప్పురావు కాలనీ 11వ లైనులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పది మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.25 వేల నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మంచి సమాజానికి విద్య ఎంతో అవసరం

● కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



దాతలను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు

కాకుమాను, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మంచి సమాజం ఏర్పాటు కావడానికి విద్య ఎంతో అవసరమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కాకుమాను నన్నపునేని వారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన మూడు అదనపు తరగతి గదులను స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పూర్వ విద్యార్థులతో కలసి ఆదివారం ప్రారంభించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు అభినందనీయం అన్నారు. ఆరి రామకృష్ణయ్య, కొల్లా రామకోటయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు, కుమార్తెలు ఒక్కో గది నిర్మాణం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందన్నారు. పేద కుటుంబాల్లో ఆణిముత్యాలైన విద్యార్థులు ఉన్నారని, తల్లిదండ్రులు కూడా వారిని బాగా చదివించాలని చెప్పారు. దేశంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర దేశాలలో ఉన్నత స్థాయిలో ఉన్న వారు సొంత గ్రామాలకు ఉపయోగపడే మంచి పనులు చేయాలని చెప్పారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్నత విద్యావంతులు తయారవ్వాలని చెప్పారు. కష్టపడితే సాధించలేనిది ఏమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు కారుమంచి ప్రసాద్‌బాబు, మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి రాంగోపాల్, ఇస్రో విశ్రాంత ఉద్యోగి నూతి సత్యనారాయణ, నల్లమోతు పూర్ణచంద్రరావు, జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, పీఎంసీ చైర్మన్ గౌరు లక్ష్మి, ఎంఈవోలు కెన్నడీ, విజయ్‌భాస్కర్, హెచ్ఎం సత్యం, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి రాష్ట్రంలో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కాకుమానులో బాపట్ల - పెదనందిపాడు ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులతో కలసి ప్రారంభించారు. (కాంట్రాక్టర్) డీడీసీ ఇన్‌ఫ్రా టెక్ ఎఫ్‌పీబీ ప్రైవేట్ లిమిటెడ్ దినేష్ దొంతినేని, ఎన్‌సీహెచ్ పుల్లారావులకు పలు సూచనలు చేశారు. రహదారి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరావు, మాజీ ఎంపీపీ రాంగోపాల్, నువ్వుల సునీల్ చౌదరి, పూర్ణచంద్రరావు, గొట్టిముక్కల వెంకటేశ్వరావు, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బంగ్లా-హిందూ పరిరక్షణ కోసం పాదయాత్ర



తాడేపల్లిలో భరతమాత విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆదివారం తాడేపల్లిలో పాదయాత్ర నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్, స్వయం సేవకులు (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో స్థానిక భరతమాత సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర పాత టోల్‌గేట్, హైవే సర్వీస్ రోడ్డు మీదుగా కుంచనపల్లి, వెంకటేశ్వర స్వామి గుడి మీదుగా తిరిగి భరతమాత విగ్రహం వరకు జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులపై పోరాడుతున్న చిన్మయిదాస్ అరెస్టుపై స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన మద్దతిస్తే బంగ్లాదేశ్ వెళ్లి పోరాడతామని వ్యాఖ్యానించారు. ఈ పాదయాత్రలో తాడేపల్లి బీజేపీ అధ్యక్షుడు టి.ఈశ్వర్ నాయుడు, ఆర్ఎస్ఎస్ కార్యకర్త బి.సాంబిరెడ్డి, సాధువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు కళ్యాణ్‌స్వామి, కె.భోగేశ్వరరావు, పెద్ద సంఖ్యలో స్వయం సేవకులు పాల్గొన్నారు.

చిన్నారులకు జేఎస్సార్ అమ్మ ఫౌండేషన్ చేయూత



నగదు అందజేస్తున్న జొన్నా శ్రీనివాసరావు

తాడేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలోని నాలుగు అంగన్‌వాడీ భవనాలకు విద్యుత్ సర్వీసుల నిమిత్తం స్పందించిన గ్రామ నేత జొన్నా శ్రీనివాసరావు (జెఎస్ఆర్) ఆపన్న హస్తం అందించారు. ఉండవల్లిలోని నాలుగు అంగన్‌వాడీ భవనాలకు విద్యుత్ సర్వీసులు అమర్చే నిమిత్తం రూ.50 వేలు వితరణ చేశారు. గ్రామంలోని కేవీఆర్ హైస్కూల్‌కు, నాలుగు అంగన్‌వాడీ భవనాలకు విద్యుత్ సర్వీసులు అమర్చే నిమిత్తం సామగ్రి అందజేశారు.

ఐదో రోజుకు చేరిన ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమకు రావలసిన న్యాయమైన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారంతో ఐదో రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రారంభించి మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీ యూ నేతలు వేముల దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు, కూరపాటి స్టీవెన్, సత్యప్రసాద్, ఆశీర్వాదం, రమాదేవి, భవన నిర్మాణ సభ్యులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

● తల్లి సమాధి వద్ద ప్రార్థన చేసి వస్తుండగా ఘటన

మేడికొండూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం అతని తల్లి గుండెపోటుతో మరణించింది. తల్లిని మర్చిపోలేక ప్రతి ఏటా ఆమె సమాధి దగ్గరకు వెళ్లి వస్తుంటాడు. అదేవిధంగా తన తల్లి సమాధిని దర్శించుకొని వస్తున్న ఆ యువకుడిని మేడికొండూరు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ రూపంలో మృత్యువు కబళించింది. బెల్లంకొండ మండలం ఎమ్మాజీగూడెంనకు చెందిన ఓర్సు వీరసింక్ (19) గుంటూరులోని వెంకటరమణ కాలనీలో నివసిస్తూ మిర్చియార్డులో కూలీ పనులకు వెళుతుంటాడు. వీరసింక్ తల్లి గుండెపోటుతో మూడేళ్ల క్రితం మరణించింది. ఆమెను స్వగ్రామమైన ఎమ్మాజీగూడెంలో సమాధి చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా అతను ఎమ్మాజీగూడెం వెళ్లి తల్లి సమాధి వద్ద నమస్కరించి ప్రార్థన చేసి వస్తుంటాడు. అదేవిధంగా ఆదివారం తల్లి సమాధి వద్ద ప్రార్థన ముగించుకొని గుంటూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వీర సింక్ తల లారీ చక్రాల కింద పడి ఛిద్రమై అక్కడికక్కడే మరణించాడు. తండ్రి ఓర్సు ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. తన తల్లి సమాధిని సందర్శించి వస్తానని చెప్పి వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

నందం, చిల్లపల్లి, తమ్మిశెట్టికి ఘన సన్మానం



అబద్దయ్య, జానకీదేవి, శ్రీనివాసరావు అభినందన సభలో పాల్గొన్న వాకర్స్

మంగళగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నుంచి రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవులు పొందిన నేతలకు ది మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవిలను ఘనంగా సన్మానించి అభి నందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

15న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తుళ్లూరు గ్రామ టీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు

తుళ్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక లైబ్రరీ సెంటర్‌లో ఈ నెల 15న జరిగే ఎన్టీఆర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు కోరారు. తుళ్లూరు గ్రామ టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఆదివారం పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ హాజరవుతున్నట్టు తెలిపారు. 15న సాయంత్రం 6 గంటలకు కొత్తూరు నుంచి ర్యాలీగా లైబ్రరి సెంటర్‌కు చేరుకొని ఎన్టీఆర్ విగ్రహం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్, రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు, నాయకులు బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనిల్, గూడపాటి శ్రీకాంత్, ఆర్యవైశ్య టీడీపీ నాయకులు గుండా శ్రీనివాసరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు బండ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ తొలగింపు

తుళ్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తుళ్లూరు సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న శాఖమూరు గ్రామానికి చెందిన జొన్నకూటి అశోక్‌ను తొలగిస్తూ సీఆర్డీయే కమిషనర్ కాటంనేని భాస్కర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రైతు రిటర్నబుల్ ప్లాటు రిజిస్ట్రేషన్ చేయటానికి సార్‌కి ఇవ్వాలంటూ లంచం రూ. లక్ష డిమాండ్ చేసి ఆ తరువాత రూ.50 వేలకు కుదుర్చుకున్నాడు. తుళ్లూరుకు చెందిన రైతు భోగినేని సుధీర్ కాల్ రికార్డు ఆధారంగా అశోక్‌ను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. రాయపూడి డిప్యూటీ కలెక్టర్ హాన్సీస్ తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో అశోక్‌పై ఫిర్యాదు చేశారు.

లూథరన్ చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ స్టార్ ఏర్పాటు



క్రిస్మస్ స్టార్‌ను ప్రారంభిస్తున్న బాబూరావు, వరప్రసాద్ తదితరులు

మంగళగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సెయింట్ పాల్స్ లూథరన్ టౌన్ చర్చి ఆధ్వర్యంలో పాత బస్టాండు సెంటరులోని న్యూఇండియా హోటల్ వద్ద భారీ క్రిస్మస్ స్టార్‌ను ఏర్పాటు చేశారు. సంఘ ప్రధాన కాపరి వరప్రసాద్ ప్రార్థనలతో గుంటూరు మధ్యమ శినడు అధ్యక్షుడు ఎస్ బాబూరావు స్టార్‌ను ప్రారంభించారు. దివంగత గూటాల రాజేంద్రప్రసాద్ కుటుం బసభ్యులు దాతలుగా వ్యవహరించారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంలో నక్షత్రం ప్రాముఖ్యతను వివరించారు. అదనపు కాపరులు నామ నవీన్, పాస్టర్ మండెపూడి దయారత్నం, సంఘపెద్దలు కారుమంచి రామారావు, గన్నెపూడి సెల్వరాజు, గొర్రెముచ్చు సికిందర్, కాకి దేవరాజు, చార్లెస్, తోకల దుర్గాప్రసాద్, కోటి మోజెస్, కరుణాకర్, స్త్రీల సమాజం, సండే స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం

● పునర్నిర్మించాలంటూ గ్రామస్థుల వినతి

● విషసర్పాలకు నిలయంగా గ్రంథాలయం



శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనం

పెదనందిపాడు, డిసెంబరు, 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొప్పర్రులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న పంచాయతీ స్థల ఆవరణలో 1975 సంవత్సరంలో గ్రామస్థుల సౌకర్యార్థం నిర్మించిన గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. గత పాలకులు నిర్లక్ష్యం వహించడంతో గ్రంథాలయ భవనం ఛిన్నాభిన్నమైంది. ఈ శిథిలమైన గ్రంథాలయం గ్రామ నడిబొడ్డున ఉండడంతో గోడలు ఎప్పుడు కూలిపోతాయోనని చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆ ప్రాంతంలో దట్టంగా పిచ్చిమొక్కలతో పాటు పెద్ద ఎత్తున వృక్షాలు ఉండటంతో విషసర్పాలకు నిలయంగా మారింది. రాత్రివేళలో అటుగుండా వెళ్లాలంటే బిక్కుబిక్కుమంటూ వెళ్ళాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించిందని, దీనిలో భాగంగా శిథిలమైన గ్రంథాలయ భవనాన్ని కూల్చి నూతన భవన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తాడికొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాడికొండలోని నార్త్ స్కూల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజలను స్పందన లభించింది. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుంటూరు శ్రేష్ట హాస్పటల్ సహాయంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్లు, గుండె, లివర్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఎముకల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ యడ్లపల్లి లక్ష్మణస్వామి ఉచితంగా 10 మందికి ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు వాసిరెడ్డి జయరామయ్య, బీజేపీ జిల్లా మైనార్టీ సెల్ సభ్యులు షేక్ బిలాల్, బండ్ల పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న శ్రేష్ట హాస్పిటల్స్ వైద్యులు

దళితులను అందలమెక్కించేది చదువు మాత్రమే

● ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి



వెంగళరావునగర్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో పాల్గొన్న ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దళితులను అందలమెక్కించేది చదువు, ప్రభుత్వ ప్రణాళికలు మాత్రమేనని ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఆదివారం స్థానిక 53వ డివిజన్ వెంగళరావునగర్ మున్సిపల్ కార్పొరేషన్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ దళితులు ఎక్కువగా ఉన్నటువంటి ఈ ప్రాంతంలోని పాఠశాలలో చదువుతున్న పిల్లలు అన్ని రంగాల్లో అగ్రగాములుగా నిలవాలన్నారు. ఇందుకు చదువు ఒక్కటే మార్గమని, ఆ చదువుని ప్రోత్సహించేది తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమేనని తెలియజేశారు. తన జీవితంలో కూడా విద్య గొప్ప పాత్ర పోషించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన తాను ఈ రోజు దేశ విదేశాల్లో ఉన్నతమైన డాక్టర్ సేవారత్న బిరుదుతో పాటు అనేక గౌరవాలు పొందానన్నారు. రాజకీయ పరంగాను అత్యున్నతమైన స్థానంలో ఉండటానికి కారణం కేవలం చదువేనని తెలియజేశారు. సబ్‌ప్లాన్ కింద పాఠశాల అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పీ రమేష్, దయారత్నం, జీఎంసీ నోడల్ ఆఫీసర్ కోటయ్య, విద్యాకమిటీ చైర్‌పర్సన్ వీర్ల త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి సన్నిధిలో టీటీడీ సభ్యుడు



అనంతవరంలో వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న సదాశివరావు దంపతులు

తుళ్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడు, నాట్కో సంస్థ ప్రతినిధి నన్నపనేని సదాశివారావు దంపతులు ఆదివారం అనంతవరం, వెంకటపాలెం వేంకటేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకున్నారు. టీటీడీ భక్తులకు కల్పించిన సౌకర్యాలు, అభివృద్ధి చేసిన పనులపై నన్నపనేని ఆరా తీశారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవాయిద్యాలతో అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. రెండు ఆలయాల్లో అభివృద్ధి పనుల గురించి టీటీడీ సిబ్బందిని నన్నపనేని అడిగి తెలుసుకున్నారు. టీటీడీ నిర్వహిస్తున్న ఆలయాలలో భక్తుల సౌకర్యాలకు కావాల్సిన అన్ని ఏర్పాటు చేస్తున్నట్టు సదాశివరావు చెప్పారు. శ్రీవారికి సేవ చేయటం కోసం బోర్డు సభ్యుడిగా అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. అనంతవరంలో ఆలయ అభివృద్ధి కోసం చేయాల్సిన పనులు గురించి రైతులు, మహిళలు సదాశివరావుకు వినతిపత్రం అందజేశారు.

కుప్పకూలిన వ్యవస్థలను గాడిన పెడుతున్నాం

● రూ.77.29 కోట్ల అభివృద్ధి పనులకు పెమ్మసాని శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనుల శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కుప్పకూలిపోయిన వ్యవస్థలన్నింటినీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కటిగా గాడిన పెడుతూ వస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక 46వ డివిజన్‌లోని నగరాలు ప్రాంతంలో ఉన్న హాసిని ఇన్‌ఫ్రా రహదారికి ఇరువైపులా సీసీ డ్రెయిన్లు, రహదారి నిర్మాణాల నిమిత్తం రూ.45.69 లక్షల అంచనాతో, 47వ డివిజన్‌లోని గోరంట్లలో కుమ్మరి బజారు ప్రాంతంలో సీసీ డ్రైన్లు, సీసీ రహదారుల నిర్మాణం నిమిత్తం రూ.1.13 కోట్ల అంచనాలతో నిర్మాణాలకుఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి పెమ్మసాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ సుమారు 240 పనులకు గాను రూ. 77.29 కోట్లు గుంటూరు కార్పొరేషన్ పరిధిలో మంజూరు చేయించినట్లు చెప్పారు. గుంటూరు శివారు ప్రాంతాల్లో ప్రధాన సమస్య అయిన తాగునీటి సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని, ఏ ఇతర సమస్యలు ఉన్న కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాబోయే ఆరు నెలల్లో చేపడతామని తెలిపారు. కార్య క్రమంలో లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు పత్తిపాడు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, స్థానిక కార్పొరేటర్ నూకవరపు బాలాజీ, వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల పుష్పాభిషేకం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వట్టిచెరుకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వింజనంపాడు గ్రామంలో శ్రీకోదండరామ స్వామి దేవాలయ 60వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం సీతా సమేత రామచంద్రమూర్తికి పుష్పాభిషేకం కన్నుల పండువగా సాగింది. కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో వచ్చారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం ఆలయ కమిటీ వారి సహకారంతో సామూహికంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణతో పూజలు నిర్వహించారు.

నేడు స్వామి వారి తెప్పోత్సవం

వింజనంపాడు గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నేపథ్యంలో సప్తాహ మహోత్సవాల చివరి రోజైన కోదండ రామ స్వామి తెప్పోత్సవ నిర్వహణకు స్థానిక మంచినీటి చెరువులో తెప్పను సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

పనిచేయని ఆర్వో ప్లాంట్

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు వివిధ పనుల నిమిత్తం తెనాలి పురపాలక సంఘ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు చేరింది. అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



దాతలను సత్కరిస్తున్న ఆలయ అధికారి

నిత్య అన్నదాన పథకానికి

రూ 90 వేల విరాళం

పెదకాకాని, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బాపట్లకు చెందిన పీట యువరాజ్, ఐశ్వర్య దంపతులు ఆదివారం పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థాన నిత్య అన్నదాన పథకానికి రూ. 90 వేలు విరాళం అందించినట్లు దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహణా. దికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పించి సహకరించ వలసిందిగా ఉప కమిషనర్ భక్తులకు విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి, స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు.

పట్టభద్రులు ఓటు నమోదును

సద్వినియెగం చేసుకోండి

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకొని సద్వినియెగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి వెంకట పూర్ణచంద్ కోరారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యాలయంలో అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్ట భద్రులు తమ ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. 2021 నాటికి డిగ్రీ పూర్తిచేసిన పట్టభద్రులు తమ ఓటును ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు సోమవారం చివరి రోజు అని తెలిపారు. ఓటును నమోదు చేసుకోని వారు ఎవరైనా ఉంటే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. కూటమి అభ్యర్థిగా మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పోటీచేస్తున్నారని, వారిని అత్యధిక మెజారిటీతో గెలిపింపించాలని కోరారు.

శివశంకర్‌కు సేవాభూషణ్ పురస్కారం

తెనాలి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన సంఘ సేవకుడు తన్నీరు శివశంకర్‌కు సేవాభూషణ్ పురస్కారం లభించింది. కాకినాడకు చెందిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంస్థ ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ నెల 10న కాకినాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో పురస్కారం ప్రధానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. పలు సేవా సంస్థలను ఏర్పాటు చేసి ఆయన అందిస్తున్న సేవలు గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. శివశంకర్‌ను పలువురు సాహిత్యవేత్తలు అభినందించారు.

12వ వేతన సవరణ కమిటీని నియమించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 12వ వేతన సవరణ కమిటీని నియమించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా కోరారు. మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ వేతన సవరణ కమిటీ ముగిసి 18 నెలలు గడిచిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని 12వ కమిటీని నియమించాలని కోరారు. అంతకుముందే ఉద్యోగులకు, పెన్షనర్లకు ఐఆర్ 28 శాతం ప్రకటించాలని, రెండేళ్లుగా ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అందాల్సిన సదుపాయాలను విడుదల చేయాలని కోరారు.

దక్షిణ భారతజోన్ బాడీబిల్డింగ్ పోటీలకు

గుంటూరు యువకులు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత జోన్ బాడీ బిల్డింగ్ పోటీలకు గుంటూరు నగరానికి మామిడాల హరి హరన్, నూర్ ఆశిక్‌లు ఎంపికైనట్లు గుంటూరు బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి గల్లా శ్రీనివాసరావు తెలిపారు. హిందూ కళాశాలకు చెందిన హరి హరన్, మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో చదువుతున్న ఆశిక్‌లు 65, 55 కేజీల కేటగిరీలో జిల్లా తరఫున ఎంపికైనట్లు పేర్కొన్నారు. 13, 14 తేదీల్లో తమిళనాడులోని తిరువళ్లూరులో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

డ్రెయిన్ల వెంబడి ఆక్రమణలు

పట్టణంలోని పలు డ్రెయిన్లు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. పట్టణంలోని సింహభాగం మురుగునీటిని వెలుపలికి తరలించే ప్రధానమైన డ్రెయిన్లను పట్టించుకోకపోవడంతో వర్షా కాలంలో పట్టణ ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు. 15 నుంచి 20 అడుగుల మేర వెడల్పు ఉండాల్సిన డ్రెయిన్లు ఆక్రమణల కారణంగా కేవలం 5 అడుగుల వెడల్పుకి చేరాయి. ఫలితంగా మురుగు నీరు ముందుకు కదలడం లేదు.

- ఇళ్ల స్థలాలు ఇచ్చినా అక్కడే నివాసాలు
- ఏళ్లు గడుస్తున్నా నోచుకోని నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు..



డ్రెయిన్ వెంబడి ఆక్రమణలు

తెనాలి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డ్రెయిన్ల వెంబడి ఆక్రమించి నివాసాలు ఏర్పరచుకున్న పేదలకు ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ ఇంకా అక్కడే నివసిస్తున్నారు. పురపాలక సంఘాలలో ఆర్థిక సంఘం నిధులను ప్రధానంగా మురుగునీటి పారుదలకు కేటాయించాల్సి ఉన్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులకు పట్టడం లేదు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో నాజరుపేటలో డ్రెయిన్ నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం మాత్రమే మిగిలింది. డ్రెయిన్లలో గుర్రపు డెక్క, తూటికాడ, పిచ్చిచెట్లు పెరిగి ఈ సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, థర్మోకోల్, చెప్పులు వంటి వ్యర్థాలతో నిండిపోతున్నాయి. దీని కారణంగా పట్టణంలో ప్రధానమైన రహదారులు వర్షాలు కురిసిన సమయంలో సైడు కాల్వలతో ఏకమై రహదారులను చెరువులను చేస్తున్నాయి. గంటల తరబడి రహదారులపై నీళ్లు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డ్రెయిన్ నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తూ గత ప్రభుత్వం శిలాఫలకం వేసినప్పటికీ పని చేస్తే డబ్బులు రావనే ఆలోచనతోనే కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో డ్రెయిన్ నిర్మాణం నిలిచిపోయింది. పూలే కాలనీ వద్దనిర్మిస్తున్న మురుగునీటి శుద్ధిప్లాంట్‌కు ఈ డ్రెయిన్ల నుంచి మురుగునీరు వెళుతుంది. పక్కాగా ప్లాంటు వరకు డ్రెయిన్‌కు ఇరువైపులా గోడలు నిర్మించాల్సి ఉండగా కొంత మేరకు మాత్రమే గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పని చేశారు. అనంతరం పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు. ఆక్రమణల కారణంగా డ్రెయిన్లలో మురుగునీరు ప్రవాహనికి ఆటంకం ఉన్నప్పటికీ తమ ఇళ్ల స్థలాలు ఇచ్చినా కూడా వారిని ఖాళీ చేయించడంలో, డ్రెయిన్లను అభివృద్ధి చేయడంలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారు. ఫలితంగా పట్టణ ప్రజలు వర్షా కాలంలో అసౌకర్యానికి గురికాక తప్పడంలేదు. ఇప్పటికైనా ప్రధాన డ్రెయిన్లపై ఆక్రమణలు గుర్తించి స్థలాలు ఇచ్చిన చోటకు వారిని తరలించాలని, డ్రెయిన్లను అభివృద్ధి చేయాలని పలువురు సూచిస్తున్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రెయిన్



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

క్రీడల్లో రాణిస్తే ఎన్నో ప్రయోజనాలు

- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పెదకాకాని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్రీడలలో రాణించడం ద్వారా ఎన్నో ప్రయోజనాలంటాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. ఈశా గ్రామోత్సవం డివిజనల్ వేడుకలలో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్ వాలీబాల్, త్రోబాల్‌లో విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సినీ నటుడు అంకిత్ కొయ్యా, సింగర్స్ స్ఫూర్తి జితేంద్ర, ప్రముఖ ఫుడ్ బ్లాగర్ శైలజ యేచూరి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు

నేటితో గడువు పూర్తి

తెనాలి రూరల్, డిసెంబరు 08(ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కు నమోదు చేసుకునే అభ్యర్థులకు సోమవారంతో గడువు పూర్తవుతుందని తహసీల్దార్ గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2021నాటికి డిగ్రీ విద్యాభ్యాసం పూర్తిచేసుకుని పట్టా పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా వారి ఓటును నమోదు చేసుకోవచ్చారు. గత నెలలో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురణ పూర్తయిందన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లైములను చి అర్హత కలిగిన అర్జీదారులను డ్రాఫ్ట్ జాబితానందు ఓటర్లుగా చేర్చినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను తహసీల్దార్ కార్యాలయంలో ప్రదర్శించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఆయా డ్రాఫ్టులను పరిశీలించుకుని సమస్యలుంటే కార్యాలయంలో అధికారులకు సంబంధిత ఫారంను పూర్తిచేసి సోమవారం సాయంత్రం 5 గంటలకల్లా అందజేయాలని అన్నారు.

బాలికా విద్యాభివృద్ధికి డీవీసీ ట్రస్ట్ చేయూత

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ వెల్లడి
- విద్యార్థినులకు 531 సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లు అందచేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): బాలికా విద్యాభివృద్ధికి డీవీసీ చారిటబుల్ ట్రస్ట్ చేయూతను అందిస్తోందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక డీవీసీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం పొన్నూరు పట్టణ, మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో 8, 9 తరగతి చదువుతున్న 531 మంది విద్యార్థినులకు ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ చేతుల మీదుగా సైకిళ్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థినులతో కలిసి పట్టణంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ పేదలకు మేలు చేయాలనే సంకల్పంతో తన తండ్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లే విధంగా డీవీసీ ట్రస్ట్ పనిచేస్తుందన్నారు. ట్రస్ట్ ద్వారా ఇప్పటికే హాస్పటల్ ఏర్పాటు చేసి పేదలకు, పాల రైతులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థినులు పాఠశాలలకు రాకపోకలు సాగించాలంటే ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి సైకిళ్లు అందచేశామన్నారు. 2019లో ప్రభుత్వం బడికెళ్తా పథకం ద్వారా మంజూరైన సైకిళ్లు విద్యార్థినులకు అందకుండా వైసీపీ నేతలు కేసులు పెట్టి అడ్డుకున్నారన్నారు. ఆయా సైకిళ్లు పాడైపోయి కోర్టు ఆదేశాల మేరకు వేలం వేస్తే ట్రస్టు ద్వారా వాటిని దక్కించుకొని మరమ్మతులు చేయించి బాలికలకు అందిదామని ప్రయత్నించినా వైసీపీ నేతలు ఆయా ప్రయత్నాలను కూడా అడ్డుకున్నారన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎట్టకేలకు అడ్డంకులు తొలగి సైకిళ్లను బాలికలకు అందచేయటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు, పొన్నూరు పట్టణ, మండలానికి చెందిన అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

13న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

రాజకీయ ప్రస్థానం సభ

- విజయవంతం చేయాలని పిలుపు

పెదకాకాని, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ఈనెల 13న నిర్వహించే పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రాజకీయ ప్రస్థానం సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీ కృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వలివేటి మురళీకృష్ణ అధ్యక్షతన ఆదివారం టీడీపీ మండల పార్టీ విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో నేతలు మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గం శాసనసభ్యుడు, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ రాజకీయ ప్రస్థానం 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 13న గుంటూరునగరంలోని రింగ్‌రోడ్డు సమీపం లోగల శుభం ఫంక్షన్‌హల్ ఎదురుగావున్న ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి సభ ప్రాంగణంలో ధూళిపాళ్ళ ఆత్మీయ అభినందన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ నేతలు విస్తృత పర్యటించి ఈ సభకు అధిక సంఖ్యలో టీడీపీ నేతలు కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరయ్యేలా కృషి చేయవలసిందిగా కోరారు. సమావేశంలో మండలంలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, మండలం, గ్రామం నేతలు, పార్టీ అనుబంధ కమిటీ నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రెండు రాష్ట్రాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తెనాలి అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి : మధ్యప్రదేశ్‌లోని విదిషాలో చదువు కున్న రెండు రాష్ట్రాల పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఎస్ఎస్ఎల్ జైన్ పీజీ కళాశాలలో 1970లో చదువుకున్న విద్యార్థులు గౌతమ్ గ్రాండ్‌లో సమావేశమయ్యారు. ఏపీతో పాటు ఎంపీ రాష్ట్రాల విద్యార్థులు కూడా ఈ సమావేశంలో పాల్గొనడం విశేషం. సుమారు 100 మంది పూర్వవిద్యార్థులు కలుసుకుని తమ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని యోగక్షేమాలు తెలుసుకుంటూ సరదాగా గడిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రభాకరరెడ్డి, పల్లవి గ్రానైట్ ఎండీ సుబ్బారెడ్డి, బజాజ్ డిస్ట్రిబ్యూటర్ బాబుల్‌రెడ్డి, ప్రసాద్, కోగంటి వెంకటేశ్వరరావు, గుమ్మడి రాజేంద్ర ప్రసాద్, విజయలక్ష్మి, స్వర్ణ కుమారి, ద్వారకానాథ్, సుధాకర్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



సంగీత విద్వాంసుడు బాజీని సన్మానిస్తున్న సాయిమాధవ్

ఘంటసాల గీతాలు మరువలేనివి

- సినీ రచయిత సాయిమాధవ్

తెనాలి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మధుర గాయకుడు ఘంటసాల ఆలపించిన గీతాలు మరిచిపోలేనివని సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ అన్నారు. ఘంటసాల అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఘంటసాల 103వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో సాయి మాధవ్ మాట్లాడుతూ, 1945లో మొదలైన ఆయన సినీప్రస్థానం 25ఏళ్లపాటు కొనసాగిందన్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్రాల్లో పది వేలకు పైగా పాటలు పాడిన ఆయన 100 సినిమాలకు సంగీత దర్శకునిగా పని చేయడం, ప్రముఖ హీరోలకు గాత్రం అందించడం చాలా గొప్ప విషయమన్నారు. అనంతరం ఘంటసాల స్వరాభిషేకం కార్యక్రమం శ్రోతలను అలరించింది. హైదరాబాద్ ఎఎంఎం మ్యూజిక్ స్టూడియో నిర్వాహకులు బుల్లెట్ బండి మ్యూజిక్ ఫేమ్ ఎస్కె బాజీని ఘనంగా సన్మానించారు. మన్నవ శ్రీనివాసరామ, శివరామకృష్ణ గుప్తా, రామచంద్రరావు, నాగసుధాకర్, బెల్లంకొండ వెంకట్, వేమూరి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సద్ది

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు స్తంభాలగరువు కోదండ రామాలయంలో అయ్యప్ప భక్తులకు 40 రోజులపాటు కొనసాగిన సద్ది ఆదివారం తో ముగిసింది. ధర్మశాస్త్ర అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఆలయ సమితి సౌజన్యంతో వేలాది అయ్యప్ప భక్తులకు ముగింపు సద్ది కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

తెనాలి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.మృత్యుంజయరావును ఆదివారం ఘనంగా సన్మానించారు. గంగానమ్మపేట పాత శివాలయంలో ఆదిశైవ సంఘం ఆధ్వర్యంలో ఆయనను శాలువా, జ్ఞాపిక, నూతన వస్త్రాలతో సత్కరించారు. ప్రముఖ శైవాగమ పండితులు మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్ మాట్లాడుతూ, ఉపాధ్యాయునిగా విద్యాభివృద్ధికి, పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడంతో పాటు పేద ప్రజలకు హోమియో ఉచిత వైద్య సేవా కేంద్రం కూడా తీరిక వేళల్లో నిర్వహిస్తూ సమాజ సేవ చేశారని అభినందించారు. నాగలింగం శ్రీనివాసకుమార్, రామలింగేశ్వరరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కవి సత్కారం అందుకుంటున్న రహీమ్ సాహెబ్

కవులకు సత్కారం

పొన్నూరుటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొన్నూరుకు చెందిన ముగ్గురు కవులకు కవి సత్కారం లభించింది. మార్కాపురం ఆదరణ వెల్ఫేర్ సొసైటీ 10వ వార్షికోత్సవం సందర్భంగా ప్రకాశంజిల్లా మార్కాపురంలో గోళ్ళ సత్యనారాయణ జాతీయ కవి సమేళనం నిర్వహించారు. ఈ సమేళనంలో పొన్నూరుకు చెందిన కవి, గాయకుడు, ఆర్టీసీ కండక్టర్ షేక్ రహీమ్‌సాహెబ్, బ్రహ్మణకోడూరు గ్రామానికి చెందిన సౌపాటి ప్రభాకర్, పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల్లో తెలుగు ఉపాధ్యాయుడు మండె సుబ్రహ్మణ్యంలకు కవి సత్కారం లభించింది. ఈ సందర్భంగా ముగ్గురు కవులను సమ్మేళన నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ రమేష్‌బాబు

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు శాంతియుతంగా మెలగాలని త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ సమాజంలో పలు నేరాలకు పాల్పడతూ రౌడీ షీటర్లని చెడ్డపేరు తెచ్చుకున్నారని, దీని ప్రభావం కుటుంబ సభ్యులపైన కూడా పడుతుందన్నారు. ఇకనైనా నేర ప్రవృత్తుని పూర్తిగా విడిచిపెట్టి, సమాజంలో మంచి కోసం పాటుబడాలన్నారు. సత్‌ప్రవర్తనతో మెలిగితే రౌడీ షీటర్‌పై ఉన్న కేసుల్లో వెసులుబాటు కలిగించేలా ఉన్నతాధికరులకు సిఫార్స్ చేస్తామన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని నేర ప్రవర్తులతో ముందుకెళ్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీ షీటర్లపై ప్రతి నిత్యం పోలీసుల నిఘా ఉంటుందని, శాంతి భద్రతలకు విఘాతం కల్గించాలని చూస్తే ఉపేక్షించేదిలేదని సీఐ రమేష్‌బాబు స్పష్టం చేశారు.

క్లస్టర్ బాంబు కంటే శక్తివంతం

కంచె ఐలయ్య పుస్తకం

- 'ది శూద్ర రెబలియన్' పుస్తకావిష్కరణ సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్

గుంటూరు(విద్య),డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ బాంబు కంటే శక్తివంతంగా ప్రొఫెసర్ కంచె ఐలయ్య తాజా పుస్తకం 'ది శూద్ర రెబలియన్' ఉందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో ఆదివారం ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది వై కోటేశ్వరరావు(వైకే) అధ్యక్షత వహించారు.మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ హమాస్‌పై ఇజ్రాయేల్ ప్రయోగించిన క్లస్టర్‌బాంబు నేరుగా వారి శత్రుశిబిరాలనే విధ్వంసం చేసిందని, ఈ పుస్తకం సమాజంలో శ్రమజీవులపై అగ్రవర్ణాలు అనుసరించే విధానాలను ప్రశ్నించేలా ఉంటుందని, ప్రజల్లో చైతన్యం నింపేలా ఉందని అన్నారు. ఈ పుస్తకం సమాజంలోకి చొచ్చుకునిపోయిన తర్వాత ప్రజల్లో మార్పు తీసుకువస్తుందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత వీసీ వియన్నారావు ప్రసంగిస్తూ సమాజం అణగారిన వర్గాల గురించి ఆలోచింపచేసేలా పుస్తకం ఉందన్నారు. వ్యవసాయదారులను స్ఫూర్తిగా తీసుకుని పుస్తక రచన చేయడం అభినందనీయమన్నారు.

ఏడు నెలలు పోరాడిన రైతుల స్ఫూర్తితోనే ఈ పుస్తకం

ఢిల్లీలో దాదాపు ఏడు నెలల పాటు పోరాటం చేసిన రైతులే తన తాజా పుస్తకం 'ది శూద్ర రెబలియన్'కు స్ఫూర్తిప్రదాతలని పుస్తక రచయిత కంచె ఐలయ్య అన్నారు. దేశసంస్కృతిక పునాది వేదం కాదని రైతుల పనిముట్లేనన్నారు. తన దృష్టిలో సమాజంలో అన్నివర్గాలు శూద్రులేనని, వారు పూర్వాశ్రమంలో శ్రమజీవులేనని అన్నారు. మనిషి మనసులో 'కులం' అనే విషబీజాన్ని తొలగించి సమాజంలో అన్ని వర్గాల వారు సమానమే అని చాటిచెప్పడమే లక్ష్యమని అన్నారు.



నిర్మాణంలో ఉన్న వీరనాయకునిపాలెం, శలపాడు రహదారి

రూ. 25 లక్షలతో రహదారి నిర్మాణం

- గత వైసీపీ మట్టిమాఫియా నిర్వాకంతో భారీగా గోతులు
- ఎమ్మెల్యే నరేంద్రకుమార్ చొరవతో నూతన రోడ్డు నిర్మాణం

చేబ్రోలు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీరనాయకుని పాలెం, శలపాడు గ్రామాల ప్రజల రోడ్డు కష్టాలు ఎట్టకేలకు తీరాయి. శలపాడు గ్రామం నుంచి వీరనాయకునిపాలెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ రూ. 25 లక్షలు మంజూరు చేయించగా, ఆ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయంలో ఆ పార్టీ నేతలు శలపాడు, వీరనాయకునిపాలెం గ్రామాల్లోని మట్టి క్వారీల నుంచి ఈ రహదారిపైనే వేలాది లారీలు అధిక లోడుతో మట్టిని తరలించారు. దీంతో ఈ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఆయా భారీ గుంతల్లో నడుమ రాకపోకలు సాగించటానికి గ్రామస్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఈ రహదారిలో అనేక ప్రమాదాలు చోటు చేసుకొని గ్రామస్థులు ఆస్పత్రుల పాలయ్యారు. అనంతరం ఈ రహదారి సమస్యను గ్రామస్థులు స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ దృష్టికి తీసుకెళ్లటంతో ఈ రహదారి మరమ్మతులకు రూ. 25 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో రహదారి నిర్మాణం శరవేగంగా జరుగుతుండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ భారాలపై ఉద్యమించండి : సీపీఎం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపడాన్ని ప్రజలందరూ ఐక్యంగా వ్యతిరేకించాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు బి.ముత్యాలరావు పిలుపు నిచ్చారు. స్థానిక 41వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్యనగర్‌లో ఆదివారం ప్రజలు విద్యుత్ బిల్లులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు దానిని పక్కనపెట్టారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తోందని అన్నారు. అదానీతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరికోతలు

- తగ్గిన దిగుబడులు.. పెరిగిన కూలీరేట్లు
- యంత్రాల కోత వైపే రైతుల చూపు



పొలాల్లో వరిని యంత్రంతో నూర్పిడి చేస్తున్న రైతులు

కొల్లిపర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో వరికోతలు ఊపందుకున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు ఒక్కసారిగా వరి కోతలు ప్రారంభించారు. కూలీల కొరతతో పాటు వ్యవసాయ కూలీ రేట్లు గణనీయంగా పెరిగటంతో మండలంలో వివిధ గ్రామాల్లోని రైతులు యంత్రాల ద్వారా వరి కోతలు కోస్తున్నారు. వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, కొల్లిపర, దావులూరు, చక్రాయపాలెం, తూములూరు, చివలూరు, సిరిపురం, అత్తోట గ్రామాల్లో నాలుగు రోజులుగా వాతావరణం అనుకూలించటంతో వరికోతలను ముమ్మరంగా ప్రారంభించారు. కూలీల కొరతతో పాటు కూలీరేట్లు ఒక్కసారిగా పెరగడంతో రైతులు యంత్రాలపై మొగ్గు చూపుతున్నారు. వరి కోతల యంత్రాలు అందుబాటులో ఉండటంతో రైతులు వాటి ద్వారానే కోతలకు సిద్ధపడుతున్నారు. కూలీలతో ఎకరం వరి కోత కోసినందుకు రూ.7వేలు, ఓదేలు తిప్పినందుకు రూ.2 వేలు, వరికుప్ప వేసినందుకు రూ. 6 వేలు , నూర్పిడికి రూ.7 వేలు చెత్త మోపులు కట్టినందుకు రూ.3 వేలు మొత్తం రూ. 25 వేలపైనే అవుతుందని రైతులు తెలుపుతున్నారు. అదే యంత్రాల ద్వారా వరికోతలు కోయిస్తే ఎకరానికి రూ.9 వేల రూపాయలతో ధాన్యం ఇంటికి చేరుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

గత సంవత్సరం ఎకరానికి 35 బస్తాల నుంచి 45 బస్తాల వరకు ధాన్యం దిగుబడులు రాగా ఈ సంవత్సరం 28 నుంచి 35లోపు ధాన్యం దిగుబడులు రావటంతో రైతులు పూర్తిగా డీలా పడిపోయారు. దీనికి తోడు గత సంవత్సరం వరి కోతలు సమయానికి 75 కిలోలు బస్తా దాన్యాన్ని 1700 నుంచి 1900 రూపాయల వరకు వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. అలాంటిది ఈ ఏడాది 1400 రూపాయల మించి కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సంవత్సరం వరిసాగు చేయడానికి అధికంగా ఖర్చులు అయినట్లు రైతులు తెలుపుతున్నారు. వరిలో రైతులు ఆశించిన దిగుబడులు రాకపోవటంతో పాటు ప్రస్తుతం ధాన్యానికి ఉన్న ధరను బట్టి పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారులు అనేక అంక్షలు పెట్టడంతో రైతులు చేసేది లేక వచ్చిన ధరను బట్టి దళారులకు అమ్ముకుని చేతులు దులుపుకుంటున్నారు. కొంత మంది రైతులు మాత్రం ధాన్యానికి మరింత ధర వస్తుందని ఆశతో యంత్రాల ద్వారా నూర్పిడి చేసిన ధాన్యాన్ని గృహాలకు తరలిస్తున్నారు.

కోతకు గురైన కరకట్ట రహదారి

- పట్టించుకోని పాలకులు, అధికారులు



కొల్లిపర సమీపంలో రేపల్లె కాల్వపై ఏర్పాటు చేసిన వంతెన దగ్గర చినకరకట్ట రోడ్డు కోతకు గురైంది. చినకరకట్టపై వాహనాల రద్దీ పెరగటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందేమోనని రైతులు, ప్రజలు భయపడుతున్నారు. కరకట్ట రోడ్డు కోతకు గురై రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇరిగేషన్ అధికారుల్లో ఎలాంటి చలనం లేదని కొల్లిపర రైతులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో కోతకు గురైన రోడ్డు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారుల స్పందించి కోతకు గురైన రోడ్డుకి మరమ్మతు చేపట్టాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు. - **కొల్లిపర, ఆంధ్రజ్యోతి**